నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 25-11-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి:33 సంచిక:101 పేజీలు:6 వెల: రూ.1/-

నేటి కందం-నేటికి అందం

భారత ప్రధాని మోడీ
తీరుగ నొప్పందములను తేకువ తోడన్
కూరుచుకొని నేపాల్ తో
భారీ వ్యాపారమునకు పథము సృజించెన్ !!

(ప్రధాని నరేంద్ర మోడీ చొరవతో భారత్ నేపాల్ దేశాల మధ్య పలు ఒప్పందాలు కుదిరి భారీ వ్యాపాభివృద్ధికి అవకాశాలు పెరిగాయి. రెండు దేశాల ప్రజలకూ లాభం చేకూరుతుంది.)

-రాధశ్రీ
సెల్:9494481210



చురక

కమలం విప్పుతున్నా
క్షేత్ర స్థాయిలో గలం
ప్రజల్లోన పాదయాత్ర
పెంచుతుందా బలం.
తెలంగాణ రాష్ట్రంపై
తెల్లారని వివక్ష
సాగుతుంది వ్యతిరేకం
సర్ మంటల సమీక్ష.

-వేల్పుల నారాయణ
9440433475



నేటి నుంచి 'వాక్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో కిషన్ రెడ్డి పాదయాత్ర

హైదరాబాద్, నవంబరు 24: 'వాక్ ఫర్ నషా ముక్త్ భారత్' పేరుతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నేటి నుంచి హైదరాబాద్‌లో పాదయాత్ర చేయనున్నారు. ఈ పాదయాత్ర అంబర్‌పేట నుంచి జూబ్లీహిల్స్ వరకు 30 కి.మీ. కొనసాగనుంది. ఈ యాత్ర ముగింపుగా ఈ నెల 27వ తేదీన సంకల్పసభను నిర్వహించనున్నారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్ డ్రగ్స్. డ్రగ్స్‌ను నియంత్రించాలని ప్రధానికి ఎన్నో లేఖలు వచ్చాయి. స్పందించిన కేంద్రం డ్రగ్స్ నియంత్రణకు చర్యలు చేపట్టింది. డ్రగ్స్ మత్తులో యువత చిత్తవుతోంది. ఇప్పటికే చాలామంది యువత డ్రగ్స్‌కు బానిసయ్యారు. యువత భవిష్యత్ కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.


రెయిన్ అలర్ట్.. ఏపీలో 4 రోజుల పాటు వర్షాలు కురిసే ఛాన్స్

అమరావతి, నవంబర్ 24: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మరో నాలుగు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ వెల్లడించారు. రాష్ట్రంలో మేఘావృతమైన వాతావరణంతో పాటు పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే ఛాన్స్ ఉందని తెలిపారు.

రేపు (బుధవారం) 14 జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ చెప్పుకొచ్చారు. మన్యం, అల్లూరి సీతారామరాజు, కోనసీమ, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో వానలు కురిసే ఛాన్స్ ఉందని వివరించారు. శ్రీసత్యసాయి, కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోనూ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. మిగతా జిల్లాల్లోనూ చెదురుమదురుగా తేలికపాటి వర్షాలు కురుస్తాయని చెప్పారు. మెరుపులు, ఈదురుగాలులతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల కింద నిలబడవద్దని హెచ్చరించారు.

ఈరోజు (మంగళవారం) సాయంత్రం 3 గంటల వరకు నెల్లూరు జిల్లా కొండాపురంలో అత్యధికంగా 39.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నంలో 34.4 మిల్లీమీటర్లు, కావలిలో 34.2 మిల్లీమీటర్లు, మారెళ్లలో 33.5 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డు అయిందని వెల్లడించారు. త్రిపురాంతకంలో 27.9 మిల్లీమీటర్లు, నెల్లూరులో 27.5 మిల్లీమీటర్లు, ములుకుదురులో 26 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైందని ప్రఖర్ జైన్ పేర్కొన్నారు.


తిరుమల భక్తులకు బీమా పథకం ప్రారంభం.. ఏడుగురికి పరిహారం అందజేత



తిరుపతి, నవంబర్ 25:దేశంలోనే తొలిసారిగా తిరుమల శ్రీవారి భక్తులకు శ్రీవారి యాత్ర సురక్ష పేరుతో తీసుకొచ్చిన బీమా పథకాన్ని టీటీడీ ప్రారంభించింది. ఇందులో భాగంగా తిరుమలలో మరణించిన భక్తుల కుటుంబ సభ్యులకు బీమా కింద రూ.2 లక్షల పరిహారాన్ని మంగళవారం టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ' శ్రీవారి యాత్ర సురక్ష' పథకం ద్వారా దేశంలోనే తొలిసారిగా భక్తులకు భరోసా కల్పిస్తున్నట్లు వెల్లడించారు. గత రెండు నెలల్లో శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చి సహజంగా మరణించిన ఏడుగురు కుటుంబ సభ్యులకు టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సీఈవో , ఎండీ ఆర్.దొరైస్వామిలతో కలిసి మంగళవారం రూ.2 లక్షలు బీమా పరిహారాన్ని అందజేశారు.

తిరుమలకు వచ్చే భక్తులు సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణించిన వారికి రూ.10 లక్షలు అందిస్తున్నామని వివరించారు. గత రెండు నెలల కాలంలో 17 మంది తిరుమలలో మరణించారని, వారిలో 7 మంది కుటుంబ సభ్యులకు బీమా పరిహారాన్ని అందించామన్నారు. మిగిలిన వారికి త్వరలో అందిస్తామని పేర్కొన్నారు. తమకు కష్టకాలంలో చేదోడువాదోడుగా నిలిచి ఆర్థికంగా ఆదుకున్నందుకు టీటీడీకి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా గ్లోబల్ సమ్మిట్: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్, నవంబర్ 24:తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ మరింత పెరిగేలా గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నామని రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబువ్యాఖ్యానించారు. ఈరోజు (మంగళవారం) భారత్ ఫ్యూచర్ సిటీలో మంత్రి పర్యటించారు. ఈ సమ్మిట్ ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

ప్రధాన వేదిక, ఎక్స్ పో జోన్, సెక్యూరిటీ, ట్రాఫిక్ నియంత్రణ, కనెక్టివిటీ, అతిథులకు వసతులు, తదితర అంశాలపై ప్రత్యేకంగా మంత్రి సమీక్షించారు. సదస్సు గడువు సమీపిస్తున్నందున పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోపు ఆయా పనులను పూర్తి చేసేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి శ్రీధర్ బాబు ఆదేశించారు.

హిందూ-సిక్కుల ఐక్యతకు సంకేతం: అమిత్ షా



డ్రగ్స్ రహిత పంజాబ్, అవినీతి నిర్మూలన

న్యూ ఢిల్లీ, నవంబర్ 24: పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ రాష్ట్ర రాజకీయాల్లో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ఆరేళ్ల విరామం తర్వాత శిరోమణి అకాలీదళ్ మళ్లీ ఎన్డీఏ కూటమిలోకి అధికారికంగా అడుగుపెట్టింది. ఇవాళ (మంగళవారం) ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఘనస్వాగతం పలికారు.

ప్రధాని నరేంద్ర మోదీ స్వయంగా ఫోన్ చేసి అకాలీదళ్‌ను ఎన్డీఏలోకి ఆహ్వానించారని అమిత్ షా వెల్లడించారు. గురునానక్ దేవ్ జయంతి పర్వదినం రోజున ఎన్డీఏను విస్తరించడం ఆనందంగా ఉందని, ఈ పొత్తు కేవలం రాజకీయ కలయిక మాత్రమే కాదని హిందూ, సిక్కుల ఐక్యతకు, సోదరభావానికి ఒక గొప్ప సంకేతమని ఆయన అభివర్ణించారు. ఇకపై శిరోమణి అకాలీదళ్ ఎన్డీఏలో అధికారిక భాగస్వామిగా ఉంటుందని, రాబోయే పంజాబ్ ఎన్నికల్లో బీజేపీ-అకాలీదళ్ కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు.

ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై నిప్పులు

అధికార ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో పంజాబ్‌లో డ్రగ్స్ సంస్కృతి విచ్చలవిడిగా పెరిగిపోయిందని అమిత్ షా తీవ్రంగా విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఆప్ పూర్తిగా విఫలమైందన్నారు. పవిత్ర గురు గ్రంథ్ సాహిబ్‌ను అవమానపరిచిన ఆమ్ ఆద్మీ పార్టీకి రాబోయే ఎన్నికల్లో ఓటమి తప్పదని, పంజాబ్ ప్రజలు బీజేపీ-అకాలీదళ్ కూటమిని ఆశీర్వదించి ఎన్డీఏ సర్కార్‌ను అధికారంలోకి తెస్తారని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు.

భారత సైన్యం కీలక నిర్ణయం.. సైనికుల మొబైల్ ఫోన్లలో 87 యాప్‌ల నిషేధం

న్యూఢిల్లీ, నవంబర్ 24:దేశ భద్రతకు భారత సైన్యం అత్యంత ప్రాధాన్యం ఇస్తుంది. దేశ రక్షణకు అవసరమైన అన్ని రకాల చర్యలను ఎప్పటికప్పుడు చేపడుతుంది. ఇందులో భాగంగా తాజాగా సైనికులు తమ మొబైల్ ఫోన్లలో వినియోగించే యాప్‌ల విషయంలో కఠిన నిబంధనలు విధించింది. ఫేస్‌బుక్, స్నాప్‌చాట్, హింజ్, పబ్‌జీ వంటి ప్రముఖ యాప్‌లతో పాటు పలు సోషల్ మీడియా, డేటింగ్, గేమింగ్ యాప్‌ల వినియోగంపై ఆంక్షలు విధించింది. మొత్తం 87 రకాల మొబైల్ అప్లికేషన్లను ఉపయోగించకూడదని సైనికులు, అధికారులు సహా సిబ్బందికి ఆదేశాలు జారీ చేసింది.

ఈ యాప్‌ల ద్వారా దేశ విద్రోహశక్తులు సైనికులను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందని భారత సైన్యం భావిస్తోంది. వారి వ్యక్తిగత సమాచారం, లొకేషన్ వివరాలు, విధులకు సంబంధించిన కీలక వివరాలను సేకరించి ప్రమాదం ఉందని అనుమానిస్తోంది. అలాగే, ఆ సమాచారాన్ని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. సైనికులు నెట్టింట షేర్ చేసే ఫొటోలు, వీడియోలు, వ్యక్తిగత వివరాలు దేశ భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందని భావిస్తోంది. ఈ సమాచారాన్ని శత్రు దేశాల నిఘా సంస్థలు తమకు అనుకూలంగా ఉపయోగించుకునే ప్రమాదం ఉన్నందున భారత సైన్యం అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. అలాగే, సైనికులు హనీట్రాప్, సైబర్ దాడుల బారిన పడకుండా ఈ చర్యలు చేపట్టింది.

కాగా, సోషల్ మీడియా వినియోగానికి సంబంధించి భారత సైన్యం ఎప్పటికప్పుడు మార్గదర్శకాలను సవరిస్తూ వస్తోంది. గతంలోనూ కొన్ని సోషల్ మీడియా వేదికల్లో సమాచారాన్ని వీక్షించేందుకు మాత్రమే అనుమతించింది. అక్కడ పోస్టులు పెట్టడం, కామెంట్లు చేయడం, సందేశాలు పంపడం వంటి కార్యకలాపాలపై పరిమితులు విధించింది. సైనికుల వ్యక్తిగత ఆన్‌లైన్ కార్యకలాపాల కంటే దేశ భద్రతకే అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ ఈ నిబంధనలను అమలు చేస్తోంది. కాగా, తాజా ఆంక్షల జాబితాలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, పబ్‌జీ, క్లాష్ ఆఫ్ కింగ్స్ వంటి గేమింగ్ యాప్‌లు ఉన్నాయి. అలాగే టిండర్, హింజ్, బంబుల్ వంటి డేటింగ్ యాప్‌లతో పాటు వీచాట్, షేర్‌ఇట్, యూసీ బ్రౌజర్, ట్రూకాలర్, జూమ్, డైలీహంట్ వంటి యాప్‌లూ ఉన్నాయి.

తెలంగాణలో పనిచేయడం సంతృప్తినిచ్చింది: మీనాక్షి నటరాజన్

హైదరాబాద్, నవంబర్ 24: తెలంగాణలో పనిచేయడం తనకు సంతృప్తినిచ్చిందని రాష్ట్ర కాంగ్రెస్ మాజీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఓ వీడియో పోస్టు చేశారు. ఈ వీడియోలో పలు అంశాలను ప్రస్తావించారు. తెలంగాణలో చాలా విషయాలను నేర్చుకున్నానని పేర్కొన్నారు.

తనకు సహకరించిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ తెలంగాణ వ్యవహారాల కొత్త ఇన్‌చార్జి బీఎం సందీప్‌కు శుభాకాంక్షలు చెప్పారు. సోనియా గాంధీ త్యాగం, కృషి వల్ల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయానికి కట్టుబడి తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.

హైదరాబాద్‌లో కార్తీక పౌర్ణమి వేళ విషాదం.. దీపాలు అంటుకుని మహిళ మృతి


హైదరాబాద్, నవంబర్ 24: నగరంలోని ఎన్ఆర్ నగర్‌లో విషాదం ఘటన చోటుచేసుకుంది. కార్తీక దీపాలు వెలిగిస్తుండగా ఓ మహిళకు ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు ఆమె చీరకు మంటలు అంటుకున్నాయి. ఈ మంటల్లో భానుమతి (64) తీవ్రంగా గాయపడింది. హుటాహుటినా కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి ఆమెను తరలించారు.

ఆ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ భానుమతి మృతిచెందింది. ఈ ఘటనలో మంటల ధాటికి ఇంట్లోని సోఫా, ఇతర వస్తువులు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంపై సమాచారం అందగానే పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై ఎస్ఆర్ నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పండుగ రోజు తీవ్ర విషాదం జరగడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

వికారాబాద్‌లో అగ్నిప్రమాదం.. ఇంట్లో సిలిండర్లు పేలినట్లు అనుమానం

వికారాబాద్ జిల్లా, నవంబర్ 24: జిల్లాలోని దోమ మండలం ఊట్‌పల్లి గ్రామంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. గ్రామంలోని ఓ ఇంట్లో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపుచేసేందుకు యత్నిస్తున్నారు. సంజీవ రెడ్డి అనే వ్యక్తి ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంట్లోని రెండు సిలిండర్లు పేలడం వల్ల అగ్ని ప్రమాదం జరిగినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సంజీవ రెడ్డి కుటుంబం పొలానికి వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. వెంటనే అక్కడకు చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు యత్నిస్తున్నారు. అయితే మంటలు అదుపులోకి రానట్లు తెలుస్తోంది. ప్రమాదం గురించి తెలిసిన వెంటనే సంజీవరెడ్డి కుటుంబసభ్యులు కూడా అక్కడకు చేరుకున్నారు. కళ్ల ముందే ఇళ్లు మొత్తం మంటల్లో కాలిపోతుండటంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



బాలికలు, మహిళల పట్ల సమాజ చూపు ఇకనైనా మారదా !

(25 నవంబర్ "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" సందర్భంగా)

ప్రకృతి సగం ఆమె. మానవ జనన కారణమూర్తి ఆమె. ఇంటికి దీపం ఆమె మనస్సు. ఆమె చేతి వంటే అమృతం. మహిమాన్విత శక్తి రూపం ఆమె. చదువుల తల్లి సరస్వతి, సంపదలు చేకూర్చే తల్లి లక్ష్మి, ధైర్యానికి చిరునామా దుర్గ మాత. ఈ మహాశక్తి స్వరూపాలు అతివలే. అబలలు కాదు, అష్టలక్ష్ములు మహిళామణులే. ఆమె లేనిదే పూట గడవదు, ముద్ద దిగదు. అయినా ఆమె అంటే పురుషాధిక్య సమాజానికి చిన్న చూపు. నేడు ఆమె ఓ ఆట వస్తువు. ఆమెను చూస్తే మృగాళ్లలో రాక్షసుడు నిద్ర లేస్తాడు. ఆమె ద్వితీయ శ్రేణి పౌరురాలు. ఆవిడంటేనే పురుష పుంగవులకు చులకన. ఆమెపై లైంగిక దాడులు, అత్యాచారాలు, మానభంగాలు, అక్రమ రవాణాలు, భ్రూణహత్యలు, గృహ హింసలు, వేధింపులు నిత్యకృత్య దుశ్శాసన పర్వాలు గుర్తుకు వస్తాయి. కార్యసిద్ధిలో లేని మగతనం మగువను చూడగానే మృగతనమై రెచ్చిపోతుంది. బాల్య వివాహ బంధనాలు, బాలకార్మిక చేష్టల చట్రాలు వాస్తవంలోకి వస్తాయి.

ఏ దేశం చూసినా ఏమున్నది గర్వకారణం !

మనతో చెల్లి, తల్లి, కూతురు ఉందని మరిచి ఆవిడపై అత్యాచారాలకు ఒడిగడుతున్న డిజిటల్ మృగ సమాజంలో లెక్కలేనన్ని దురాగతాలు జరుగుతున్నాయి. ఏరులై పారుతున్న మహిళల కన్నీళ్లను చూసి పౌర సమాజంలో ఇసుమంతైనా మానవత్వం కనిపించడం లేదు. ప్రపంచవ్యాప్తంగా 35 శాతం మహిళలు తమ జీవితకాలంలో ఏదో ఒక రకమైన లైంగిక వేధింపులకు గురికావడం, వీరిలో 40 శాతం అబలలు వేధింపుల నుంచి సహాయం కోరడం, 10 శాతం వరకు మాత్రమే న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కడం జరుగుతున్నది. మహిళపై అత్యాచారం జరిగినపుడు పౌర సమాజం ఉద్యమించడం, రెండు రోజులకే చల్లబడడం, పాత వెతలే తిరిగి జరగడం అనాదిగా జరుగుతోంది. ప్రతి రోజు అదో ఒక మూలన మానభంగ మహిళ మౌన రోదన గొంతు దాటడం లేదు. విని స్పందించడానికి బదులు ఎగతాళి, అవమానం చేయడమనే దురలవాట్లు మొలుస్తున్నాయి. ఐరాస అంచనాల ప్రకారం, మానవ అక్రమ రవాణా చట్రంలో 71 శాతం మంది మహిళలే ఉంటున్నారు. కేవలం 52 శాతం గృహిణులు మాత్రమే కొంత స్వేచ్ఛను అనుభవిస్తున్నారు. ప్రపంచంలో అధిక రేప్ కేసులు నమోదవుతున్న దేశాల జాబితాలో దక్షిణ ఆఫ్రికా, బోత్స్‌వానా, స్వీడెన్, గ్రనెడా, యూఎస్‌లు ముందు వరసలో ఉన్నాయి. అమెరికాలో 9 శాతం రెపిస్టులపై విచారణలు జరుగగా, అందులో 3 శాతం వరకు మాత్రమే శిక్షలు పడడం, 97 శాతం రేపిస్టులు స్వేచ్ఛగా బయట పడడం గమనిస్తున్నాం. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, వేధింపులు జరిగినా వాటిని బయట పెట్టడానికి స్త్రీ సమాజం వెనుకంజ వేయడంతో మగ మహా రాక్షసుల ఆగడాలకు అంతం కనుపించడం లేదు.

భారత్‌లో మహిళలపై అత్యాచారాలు:

ప్రపంచవ్యాప్త మహిళలు, బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసాత్మక దారుణులను గమనించిన ఐరాస 2000 నుంచి ప్రతి ఏట 25 నవంబర్ రోజున "అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం" పాటించడం ఆనవాయితీగా మారింది.

అంతర్జాతీయ మహిళా అత్యాచార వ్యతిరేక దినం-2026 ఇతివృత్తంగా "మహిళలు, బాలికలపై హింస అంతానికి అందరం ఏకమవుదాం : న్యాయ కల్పన, బాధితుల సంరక్షణ, అత్యాచార దోషులను శిక్షించడం" అనబడే అంశాన్ని తీసుకోవడం జరిగింది.

మహిళా హింసకు "నో" చెప్పాలంటూ యునెస్కో 25 నవంబర్ నుంచి 10 డిసెంబర్ వరకు 16 రోజుల పాటు లింగ-ఆధార్ హింసలకు వ్యతిరేకంగా ప్రచారాలు నిర్వహిస్తున్నది. ప్రపంచ మానభంగాల రేటు ఆధార 120 దేశాల జాబితాలో భారత్‌కు 95వ స్థానం దక్కడం విచారకరం. భారత్‌లో తరుచుగా నిర్భయ, హత్రాస్ ఘటనలు ఎన్ని జరిగిన తాత్కాలిక చర్యలకు మాత్రమే ప్రభుత్వాలు పూనుకోవడం దురదృష్టకరం, ఆక్షేపణీయం.

ఇండియాలో ప్రతి లక్ష మందిలో 4.2 శాతం రేప్‌లు జరుగుతున్నాయని, రేప్ కేసులు అధికంగా (20 నుంచి 10 శాతం) చంఢీఘడ్, రాజస్థాన్, ఢిల్లీ, కేరళ, హర్యానా, అస్సాం, హిమాచల్ ప్రాంతాల్లో నమోదు అవుతున్నాయి. రేప్ కేసులు అత్యల్పంగా (1 నుంచి 1.6 శాతం వరకు) గుజరాత్, కర్నాటక, తమిళనాడు, నాగాలాండ్ రాష్ట్రాల్లో నమోదు కావడం గమనించారు. తెలంగాణలో 4.7 శాతం, ఏపీలో 4.2 శాతం రేప్ కేసులు బయట పడుతున్నాయి. గత దశాబ్ద కాలంగా రేప్ కేసులు రెట్టింపు కావడాన్ని ప్రమాద హెచ్చరికగా భావించాలి.

బాలికల అక్రమ రవాణా దుర్మార్గాలు:

మానవ హక్కుల సంస్థ గణాంకాల ప్రకారం, భారత్‌లో ప్రతి ఏట 7,200 మైనర్ బాలికలు (లక్షకు 1.6 శాతం) మానభంగాలకు గురి కావడం భరతజాతికే సిగ్గు చేటు. బాలికల అక్రమ రవాణా, ఆ చిన్నారులను వ్యభిచార నరక కూపాల్లో బంధించడం యద్ధేచ్ఛగా కొనసాగుతోంది. దేశ జనాగ్రహావేశాలను చవి చూసిన ఢిల్లీ నిర్భయ కేసులో నిందితులకు శిక్ష పడడానికి 6 ఏండ్ల కాలం పట్టింది. అధిక శాతం మానభంగాలు 15 - 24 ఏండ్ల యువతుల్లోనే కనిపించడం, 70 శాతం మానభంగ నిందితులు తెలిసిన వారే కావడం సోచనీయం.

మానభంగాల తర్వాత అతివలను హత్య చేయడం కూడా సాధారణంగా జరుగుతున్న వేళ, ఈ దుశ్చర్యలకు చరమగీతం పాడడానికి ప్రభుత్వాలు, న్యాయ వ్యవస్థలు, పోలీసు యంత్రాంగాలు, పౌర సమాజం సమన్వయంతో కృషి చేసి మానవ మృగాలకు చుక్కలు చూపించడం, ఉరి తీసి నరకానికి పంపడం వెంట వెంటనే జరగాలి.

విద్యాలయాల్లో రేపటి యువతకు విలువలతో కూడిన విద్యను బోధించాలి. యూనివర్సిటీ డిగ్రీల కన్న మానవీయ విలువలే మిన్నయని తెలియజేయాలి. భారత మాత ముద్దు బిడ్డలుగా అమ్మాయిలను రక్షించాలి.

మహిళకు విద్య అనే ఆయుధమిచ్చి సబలగా శక్తివంతం చేయాలి.

మానభంగాలు లేని ప్రపంచాన్ని చూడడానికి అందరం విలువలతో కూడి క్రమశిక్షణతో జీవించాలి. ఈ మహాయజ్ఞంలో మనందరం భాగస్వాములమై ప్రతి మహిళలో భరతమాతను దర్శిస్తూ ముందుకు సాగుదాం. ఇకనైనా భారతీయ వనిత కన్నీటి వరదల కట్టడికి ఆనకట్టలు కడదాం.



-మధుపాళీ
9949700037

జైలు నుంచి విడుదలైన వారు కొత్త జీవితాన్ని ప్రారంభించేందుకు మరో అవకాశం ఇవ్వాలి.. 57వ ఇఫీ వేదికపై 'న్యూ హోమ్' దర్శకుడు నికితా గ్రుషిన్

న్యూఢిల్లీ, నవంబర్ 24: జైలు జీవితాన్ని గడిపి, ఏళ్ల తర్వాత తిరిగి సమాజంలోకి అడుగుపెట్టేవారు తమ జీవితాలను పునర్నిర్మించుకోవడంలో, గత అనుభవాల భారాన్ని అధిగమించడంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటారని, అయితే ఈ సమస్యకు తగినంత గుర్తింపు లభించడం లేదని రష్యన్ చిత్ర దర్శకుడు, 'న్యూ హోమ్' చిత్ర దర్శకుడు శ్రీ నికితా గ్రుషిన్ పేర్కొన్నారు. గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

తన చిత్రానికి ప్రేరణ కలిగించిన అంశాలను వివరిస్తూ, సుదీర్ఘకాలం జైలు శిక్ష అనుభవించిన అనంతరం పునరావాసం పొందుతున్న కొందరితో జరిపిన సంభాషణలు వారు తిరిగి సమాజంలో కలిసిపోయి సాధారణ జీవితాన్ని గడపడానికి ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి తనకు అవగాహన కల్పించాయని శ్రీ గ్రుషిన్ తెలిపారు. ఈ అనుభవాలకు తగినంత ప్రాధాన్యం లభించడం లేదనే ఉద్దేశంతో అంతర్జాతీయ స్థాయిలో తొలిసారిగా ప్రదర్శిస్తున్న తన తొలి చలనచిత్రం ద్వారా వారి కథలను విస్తృత ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. జైలు జీవితం నుంచి బయటకు వచ్చిన తర్వాత తమ జీవితాలను తిరిగి నిర్మించుకోవడానికి, జీవితానికి కొత్త అర్థాన్ని వెతుక్కోవడానికి ప్రయత్నిస్తున్న పురుషులు, మహిళలు ఎదుర్కొంటున్న సంఘర్షణలను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది.

శ్రీ గ్రుషిన్ రచించి, దర్శకత్వం వహించిన 'న్యూ హోమ్' (నోవీ డోమ్) చిత్రం అన్నా అనే మహిళ కథను ఆవిష్కరిస్తుంది. ఏడేళ్ల జైలు జీవితం అనంతరం విడుదలైన ఆమెకు చేతిలో డబ్బు లేదు. కుటుంబ సభ్యుల అండదండలు లేవు. జీవితంలో ఎలా ముందుకు సాగాలో కూడా స్పష్టత లేదు. సామాజిక సేవా సంస్థల సహాయంతో ఆమెకు ఒక ఉద్యోగం, నివాసం లభిస్తాయి. వరస్పర సహకారం అందించుకునే ఒక బృందంలో కూడా చేరుతుంది. అక్కడే రోమన్ పరిచయమవుతాడు. అతని సహకారంతో అన్నా క్రమంగా తన జీవితాన్ని తిరిగి చక్కదిద్దుకునే ప్రయత్నం చేస్తుంది. అయితే తన భవిష్యత్తును నిర్ణయించగల ఒక క్లిష్టమైన నిర్ణయం తీసుకునే ముందు ఆమె తన గతాన్ని, అంతరంగంలో కొనసాగుతున్న సంఘర్షణలను ఎదుర్కోవాల్సి వస్తుంది. పశ్చాతాపం, క్షమాపణ, పునరావాసం, జీవితంలో మరో అవకాశం లభించే సాధ్యాసాధ్యాలు వంటి అంశాలను ఈ చిత్రం స్పృశిస్తుంది.

కథలోని ప్రధాన పాత్ర రూపకల్పన గురించి వివరిస్తూ, అన్నా పాత్రను ఏ ఒక్క వ్యక్తినీ దృష్టిలో ఉంచుకుని రూపొందించలేదని శ్రీ గ్రుషిన్ స్పష్టం చేశారు. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొని, తమ జీవితాలను తిరిగి నిర్మించుకునేందుకు ప్రయత్నిస్తున్న పలువురితో జరిపిన సంభాషణల నుంచి ప్రేరణ పొందినట్టు చెప్పారు. నిజ జీవితంలో తాను గమనించిన ఈ అనుభవాలే కథకు పునాదిగా నిలిచాయని, వాటికి తన రచనా నైపుణ్యాన్ని, సృజనాత్మక దృక్పథాన్ని జోడించి చిత్ర కథనాన్ని రూపొందించానని ఆయన తెలిపారు.

చిత్రంలోని ప్రధాన సందేశం గురించి వివరిస్తూ, జైలు నుంచి విడుదలైన వారు ఎదుర్కొనే సవాళ్లు ఏ ఒక్క దేశానికో, సమాజానికో పరిమితమైనవి కావని దర్శకుడు అభిప్రాయపడ్డారు. శిక్షాకాలం పూర్తయి బయటకు వచ్చిన తర్వాత కూడా చాలామంది తీవ్ర అపరాధ భావనతో సతమతమవుతుంటారని, ఆ భావన వారి నిర్ణయాలను ప్రభావితం చేయడమే కాకుండా, జీవితంలో ముందుకు సాగకుండా అడ్డుకుంటుందని పేర్కొన్నారు. అన్నా జీవిత ప్రయాణం ద్వారా వ్యక్తులు ఈ మానసిక భారాన్ని ఎలా ఎదుర్కొంటారు? తిరిగి కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి అవసరమైన ధైర్యాన్ని ఎలా కూడగట్టుకుంటారు అనే అంశాలను ఆవిష్కరించేందుకు ప్రయత్నించినట్లు ఆయన తెలిపారు.

విలేకరుల సమావేశంలో దర్శకుడితో పాటు పాల్గొన్న ఛాయాగ్రాహకురాలు శ్రీమతి ఎకటెరీనా స్మోలినా తమ సృజనాత్మక భాగస్వామ్యం గురించి వివరించారు. ఫిల్మ్ స్కూల్ రోజుల నుంచే తమకు పరిచయం ఉందని, గతంలో కలిసి మూడు లఘు చిత్రాలకు పనిచేశామని గుర్తుచేసుకున్నారు. దీర్ఘకాలంగా కొనసాగుతున్న తమ స్నేహం, ఒకరి పని విధానం గురించి మరొకరికి ఉన్న అవగాహన కారణంగా చిత్రీకరణ సమయంలో సహజమైన సమన్వయం ఏర్పడిందని ఆమె తెలిపారు. దీంతో సృజనాత్మక ప్రక్రియ సౌకర్యవంతంగా సాగడమే కాకుండా, మంచి అనుభూతిని కూడా అందించిందని పేర్కొన్నారు.

ఛాయాగ్రహణ రంగంలోకి ప్రవేశించే మహిళలు ఎదుర్కొనే సవాళ్ల గురించిన ప్రశ్నకు శ్రీమతి స్మోలినా సమాధానమిస్తూ, తనకు కూడా తొలినాళ్లలో భయం, అనిశ్చితి ఎదురయ్యాయని గుర్తుచేసుకున్నారు. అయితే, క్రమంగా ఆ భయాలను అధిగమించానని తెలిపారు. ఛాయాగ్రహణాన్ని వృత్తిగా ఎంచుకోవాలనుకునే ఔత్సాహిక మహిళలు ప్రారంభంలో ఎదురయ్యే భయాందోళనలకు వెనుకడుగు వేయకుండా, ఆత్మవిశ్వాసం, దృఢ సంకల్పంతో ఈ రంగంలో ముందుకు సాగాలని ఆమె సూచించారు.

భారత, రష్యా చలనచిత్ర రంగాల మధ్య మరింత విస్తృత సహకారానికి ఉన్న అవకాశాల గురించి మాట్లాడుతూ, ఇరు దేశాల మధ్య సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న సినీ అనుబంధాన్ని శ్రీ గ్రుషిన్ గుర్తుచేసుకున్నారు. సోవియట్ యూనియన్ కాలంలో భారతీయ సినిమాలకు విశేష ఆదరణ లభించిందని, నేటికీ రష్యా ప్రేక్షకుల హృదయాల్లో భారతీయ చిత్రాలకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన పేర్కొన్నారు.

భవిష్యత్తులో భారత్ - రష్యా దేశాల మధ్య చలనచిత్ర రంగంలో భాగస్వామ్యాలకు అపారమైన అవకాశాలున్నాయని శ్రీ గ్రుషిన్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సహకారం కేవలం ఆర్థిక పెట్టుబడులు, సాంకేతిక పరిజ్ఞానం పరస్పర మార్పిడికే పరిమితం కాకూడదని ఆయన అభిప్రాయపడ్డారు. ఇరు దేశాల ప్రజల మధ్య ఉన్న అనుబంధాలను ప్రతిబింబించే కథలు, సాంస్కృతిక పరస్పర అవగాహనకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా మరింత బలమైన సృజనాత్మక భాగస్వామ్యాలకు పునాది వేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

వేవ్స్ బజార్ ద్వారా సరికొత్త కథాంశాల అన్వేషణకు ఎన్ఎఫ్‌డీసీ, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా భాగస్వామ్యం

న్యూ ఢిల్లీ, నవంబర్ 24: గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) సందర్భంగా జాతీయ చలనచిత్ర అభివృద్ధి సంస్థ (ఎన్ఎఫ్‌డీసీ), సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా (ఎస్‌పీఎన్ఐ) ఈ రోజు ఒక అవగాహన ఒప్పందం (ఎంఓయూ)పై సంతకాలు చేశాయి. ఇందులో భాగంగా వేవ్స్ బజార్ - ఎన్‌పీఎన్ఐ సృజనాత్మక కథాంశాల ఆహ్వాన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నాయి.

ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న రచయితలు, సృజనకర్తలు, నిర్మాణ సంస్థలు తమ వినూత్న కల్పిత, వాస్తవిక కథాంశాలను హిందీ, ఆంగ్లం, తమిళం, తెలుగు, బెంగాలీ భాషల్లో ఎస్‌పీఎన్ఐకి సమర్పించి, వాటిని నిర్మాణ ప్రతిపాదనలుగా వివరించే అవకాశం లభిస్తుంది.

కల్పిత కథా ధారావాహికలు, ప్రీమియం టీవీ+ కంటెంట్, రియాలిటీ షోలు, గేమ్, పోటీ కార్యక్రమాల రూపకల్పనలు, ప్రతిభ ఆధారిత కార్యక్రమాలు, ముందుగా స్క్రిప్టు సిద్ధం చేయని ఇతర వినూత్న కార్యక్రమాల ఆలోచనలు సహా వివిధ ఫార్మాట్లలో ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నారు. ఎంపికైన దరఖాస్తుదారులకు తమ కథాంశాలు, కార్యక్రమాల ఆలోచనలను ఎన్‌పీఎన్ఐ ప్రతినిధులకు వివరించే అవకాశం కల్పిస్తారు. వాటిని పరిశీలించిన అనంతరం, తగిన ప్రతిపాదనలను మరింత అభివృద్ధి చేసి వాటిని నిర్మించే అవకాశాన్ని పరిశీలిస్తారు.

సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న ఎన్ఎఫ్‌డీసీకి చెందిన పరిశ్రమల అనుసంధాన వేదిక - వేవ్స్ బజార్ - భారత మీడియా, వినోద రంగంలోని వివిధ భాగస్వాములతో సృజనాత్మక ప్రతిభావంతులను అనుసంధానిస్తోంది. ఈ భాగస్వామ్యం ద్వారా వినూత్న కథలకు మరిన్ని అవకాశాలు కల్పించడం, ముఖ్యంగా ప్రాంతీయ మార్కెట్ల నుంచి వచ్చే కథాంశాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. విభిన్న నేపథ్యాలకు చెందిన వ్యక్తుల గొంతుకలు, భిన్న దృక్పథాలు మరింత విస్తృతమైన ప్రేక్షకులకు చేరువయ్యేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుంది.

ఎంఓయూపై సంతకాలు చేసిన సందర్భంగా ఎన్ఎఫ్‌డీసీ చైర్మన్ జి. కృష్ణకుమార్ మాట్లాడుతూ, "ఐఎఫ్ఎఫ్ఐ సినిమా, దాని రూపకల్పనలో భాగస్వాములయ్యే కళాకారులు, సాంకేతిక నిపుణులందరి వేడుకగా నిలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కథలు, సంస్కృతులు, సృజనాత్మక గొంతుకలను ఈ వేదిక ఒకచోటికి చేరుస్తుంది. చిత్రాలు, వాటిని ఆవిష్కరించే గొంతుకల్లోని వైవిధ్యమే ఈ ఏడాది చలనచిత్రోత్సవానికి ప్రత్యేక ఆకర్షణ. ' విశ్వజనీన కథలు' అనే ఇతివృత్తం సినిమా స్ఫూర్తిని అద్భుతంగా ప్రతిబింబిస్తోంది" అని పేర్కొన్నారు.

ఎన్ఎఫ్‌డీసీ మేనేజింగ్ డైరెక్టర్ ధీరజ్ సింగ్ మాట్లాడుతూ, "సృజనాత్మక ప్రతిభావంతులకు, చలనచిత్ర పరిశ్రమకు మధ్య అర్థవంతమైన అనుసంధానాలను ఏర్పరచడంలో వేవ్స్ బజార్ నిరంతరం కృషి చేస్తోంది. సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియాతో ఈ భాగస్వామ్యం ద్వారా రచయితలు, సృజనకర్తలు, నిర్మాణ సంస్థలకు వివిధ భాషలు, ఫార్మాట్లలో తమ వినూత్న కథాంశాలను పరిచయం చేసేందుకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి" అని పేర్కొన్నారు.

సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ గౌరవ్ బెనర్జీ మాట్లాడుతూ, "దేశవ్యాప్తంగా అపారమైన సృజనాత్మక ప్రతిభ ఉంది. అయితే, వారి ఆలోచనలకు, కథాంశాలకు ఎల్లప్పుడూ ప్రముఖ వేదికలపై చోటు లభించడం లేదు. వేవ్స్ బజార్ ద్వారా ఎన్ఎఫ్‌డీసీతో కుదుర్చుకున్న ఈ భాగస్వామ్యం వివిధ భాషలు, ఫార్మాట్లలో రచయితలు, సృజనకర్తలు తమ వినూత్న ఆలోచనలను మాకు పరిచయం చేసేందుకు మరిన్ని అవకాశాలను కల్పించే దిశగా వేసిన ముందడుగు. ప్రేక్షకులకు కొత్తదనంతో కూడిన దృక్పథాలను, ఆసక్తికరమైన కథాంశాలను అందించే ప్రతిభావంతులను, వినూత్న ఆలోచనలను గుర్తించేందుకు మేం ఎదురుచూస్తున్నాం" అని పేర్కొన్నారు.

భావోద్వేగాల సార్వత్రిక భాష ద్వారా సినిమా మానవాళిని ఏకం చేస్తుంది: కార్లా సోఫియా గాస్కాన్

న్యూఢిల్లీ, నవంబర్ 24: సినిమా భౌగోళిక, సాంస్కృతిక హద్దులను అధిగమించి.. మానవ భావోద్వేగాలనే విశ్వభాష ద్వారా ప్రజలను అనుసంధానిస్తుందని ప్రముఖ నటి కార్లా సోఫియా గాస్కోన్ అన్నారు. గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫి)లో భాగంగా నేడు 'స్టేజెస్ అక్రాస్ బోర్డర్స్' పేరుతో నిర్వహించిన ప్రత్యేక మాస్టర్‌క్లాస్‌లో ఆమె ఈ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

అభిరుచి, అంకితభావం ప్రా ధాన్యతను వివరిస్తూ.. వర్ధమాన నటులు తమపై తాము నమ్మకం ఉంచాలని, తమ ప్రత్యేకతను కాపాడుకోవాలని, నటన పట్ల నిబద్ధతతో ఉండాలని గాస్కోన్ సూచించారు. తమ వృత్తిని నిజంగా ప్రేమించినప్పుడే సహజ మైన నటనను ప్రదర్శించగలమని ఆమె పేర్కొన్నారు.

తన నటనా విధానం గురించి వివరిస్తూ.. ప్రతి పాత్రలోనూ పూర్తిగా లీనమవుతానని, లోతైన భావోద్వేగ అనుభూతుల ద్వారా తెరపై సహజత్వాన్ని తీసుకొస్తానని చెప్పారు. సంప్రదాయానికి భిన్నమైన, సవాళ్లతో కూడిన పాత్రల్లో నటించేందుకు తాను ఇష్టపడతానని తెలిపారు. తమ అనుభవాలకు పూర్తిగా భిన్నమైన పాత్రలను పోషించడం ద్వారా కొత్త సృజనాత్మక ఆలోచనలు, కళాత్మక ఎదుగుదల, ఆత్మపరి శీలనకు అవకాశం లభిస్తుందని వివరించారు.

నటన అనేది నిరంతరం సవాళ్లు, కొత్త అనుభవాలతో కూడిన ప్రయాణమని గాస్కోన్ అన్నారు. ప్రతి పాత్రను కొత్త కోణంలో అర్థం చేసుకుని, విభిన్నమైన నటనా విధానాన్ని అనుసరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భౌగోళిక ప్రాం తాలు, సాంస్కృతిక నేపథ్యాలతో సంబంధం లేకుండా.. అందరి లోనూ ఉండే ఉమ్మడి మానవ భావోద్వేగాల ద్వారా ప్రేక్షకులను ఏకం చేసే ప్రపంచ భాషే సినిమా అని అభివర్ణించారు.

సినిమా నిర్మాణం అనేది సమష్టి కృషితో కూడుకున్న ప్రక్రియ అని పేర్కొంటూ.. సృజనాత్మక బృందంలోని ప్రతి ఒక్కరి పాత్రను ఆమె ప్రశంసి ంచారు. చిత్ర రూపకల్పనలో దర్శకులు, ఇతర సాంకేతిక, సృజనాత్మక బృంద సభ్యుల సమష్టి ఆలోచనలు, కృషి కీలకమని వివరించారు.

ఈ మాస్టర్‌క్లాస్ ద్వారా వర్ధమాన నటులు, చిత్రని ర్మాతలు, సినీ ప్రేమికులకు సృజనాత్మక ప్రక్రియ, నటనలోని సూక్ష్మాంశాలు, సినిమా నిర్మాణం లో సమష్టి కృషి ప్రాధాన్యంపై విలువైన అవగాహన లభించింది.

బాసర త్రిబుల్ ఐటీలో విషాదం

ఉరేసుకొని విద్యార్థి బలవన్మరణం



ఆదిలాబాద్, నవంబర్ 24: నిర్మల్ జిల్లా బాసర రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ట్రిపుల్ ఐటీ)లో విషాదం చోటుచేసుకుంది. ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి హాస్టల్ గదిలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి గ్రామానికి చెందిన చల్ల సంపత్ (19) సోమవారం రాత్రి గోదావరి బ్లాక్ బాలుర వసతి గృహంలోని తన గదిలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.

గమనించిన తోటి విద్యార్థులు, కళాశాల సిబ్బంది వెంటనే అధికారులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. చదువులో ప్రతిభ కనబరుస్తూ తరగతిలో టాపర్‌గా ఉన్న సంపత్ మృతితో తోటి విద్యార్థులు విషాదంలో మునిగిపోయారు. విద్యార్థి వ్యక్తిగత సమస్యల నేపథ్యంలో అతను మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అసలు కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న కమిషనర్

14 నెలల్లో విద్యానగర్ కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చొరవ
22 రోడ్లకు అభివృద్ధి పనులు.. కమిషనర్ అభిషేక్ అగస్త్యకు ప్రశంసల వెల్లువ
వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధుల అభినందన

ఖమ్మం, నవంబర్ 24: ప్రజలకు ఇచ్చిన హామీని ఆచరణలో చూపిస్తూ అభివృద్ధి పనులతో నమ్మకాన్ని నిలబెట్టుకున్నారు ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని విద్యానగర్ కాలనీలో రోడ్లు, డ్రైనేజీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, 14 నెలల వ్యవధిలోనే మౌలిక వసతుల కల్పనకు గణనీయమైన పురోగతి సాధించారు. కమిషనర్ చొరవతో కాలనీలో అభివృద్ధి పనులు వేగవంతం కావడంపై విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

ఈ మేరకు సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ అభిషేక్ అగస్త్యను కలిసి అభినందన పత్రం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 1, 4వ డివిజన్లలో ఉన్న విద్యానగర్ కాలనీ 2012 నుంచి అభివృద్ధి చెందుతున్నప్పటికీ, చాలాకాలంగా సరైన సీసీ రోడ్లు, డ్రైనేజీ సదుపాయాలు లేక స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కాలనీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 2025 ఆగస్టులో విద్యానగర్ వెల్ఫేర్ సొసైటీని ఏర్పాటు చేసి, సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

కాలనీవాసుల విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించడంతోపాటు, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పనులు వేగంగా జరిగేలా చొరవ తీసుకున్నారు. ఫలితంగా 4వ డివిజన్‌లోని మొత్తం 8 రోడ్లకు సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. 1వ డివిజన్‌లో మొత్తం 28 రోడ్లకు గాను 14 రోడ్ల పనులు పూర్తికాగా, మరో 3 రోడ్ల పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి.

ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్న కమిషనర్ పనితీరు అభినందనీయమని సొసైటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అభివృద్ధి పనుల రూపంలో కార్యరూపంలోకి తీసుకురావడం ద్వారా ప్రజల్లో అధికారులపై నమ్మకం, భరోసా కల్పించారని కొనియాడారు. అధికారులు బదిలీపై వెళ్లినా ప్రజల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులు చిరకాలం గుర్తుండిపోతాయని అభినందన పత్రంలో పేర్కొన్నారు.

కమిషనర్ అభిషేక్ అగస్త్య భవిష్యత్తులో మరిన్ని ఉన్నత బాధ్యతలు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలని ఆకాంక్షించారు.

యాదగిరిగుట్టలో పోటెత్తిన భక్తజనం..!

ఉదయం నుంచే శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు
రద్దీకి అనుగుణంగా బ్యాచ్‌ల వారీగా నిర్వహణ
పకడ్బందీ ఏర్పాట్లు చేసిన దేవస్థానం
స్ఫటిక లింగానికి భక్తుల స్వయంగా అభిషేకాలు
అఖండ దీపం వద్ద కార్తీక దీపారాధనలు

నల్గొండ, నవంబర్ 24: పరమ పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి దివ్యక్షేత్రం ఆధ్యాత్మిక శోభతో విరాజిల్లు తోంది.. పౌర్ణమి వేళ హరిహర రులను దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు మంగళవారం తెల్లవారు జాము 4 గంటల నుంచే భక్తులు భారీ సంఖ్యలో కొండపైకి చేరుకున్నారు. దీంతో ఆలయ పరిసరాలు గోవింద నామస్మరణ, ఓం నమఃశివాయ పంచాక్షరీ మంత్రోచ్చారణలతో మార్మోగుతున్నాయి.. ఓవైపు శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు, మరోవైపు శివాలయంలో స్ఫటిక లింగానికి అభిషేకాలు, కార్తీక దీపారాధనలతో క్షేత్రమంతా భక్తజన సంద్రంగా మారింది.



కార్తీక పౌర్ణమి సందర్భంగా సుదూర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారని ముందుగానే అంచనా వేసిన దేవస్థానం అధికారులు, ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భక్తుల తాకిడికి అనుగుణంగా వ్రత మండపంలో ప్రత్యేకంగా బ్యాచ్‌ల వారీగా శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలను నిరంతరాయంగా నిర్వహిస్తున్నారు. వేకువజాము నుంచే దంపతులు, కుటుంబ సభ్యులు వ్రత పీఠాల వద్ద కూర్చుని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత భక్తిశ్రద్ధలతో వ్రతాలను ఆచరిస్తున్నారు. భక్తులకు వ్రత సామగ్రి అందజేయడం నుండి, ప్రసాద వితరణ వరకు సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

కార్తీక మాసంలో శివకేశవుల ఆరాధనకు విశేష ప్రాధాన్యత ఉండటంతో, దేవస్థాన ప్రాంగణంలోని క్షేత్రపాలకుడు శ్రీ పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఇక్కడ భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వయంగా స్ఫటిక లింగానికి పంచామృతాలు, పవిత్ర జలాలతో అభిషేకాలు నిర్వహిస్తూ పరమశివుని అనుగ్రహాన్ని పొందుతున్నారు. శివాలయ ప్రాంగణమంతా భక్తుల రుద్రాభిషేకాలు, బిల్వార్చనలతో ఆధ్యాత్మిక వాతావరణం నంతరించుకుంది.

కార్తీక పౌర్ణమి వేళ దీపదానం, దీపారాధన చేస్తే సకల పాపాలు తొలగి అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయన్న విశ్వాసంతో భక్తులు దీపారాధనలకు బారులు తీరారు. ఉభయ దేవాలయాల వద్ద దేవస్థానం తరఫున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దీపారాధన మండపాల్లో, ప్రధాన ఆలయం ఎదుట, అలాగే శివాలయం వద్ద ఉన్న అఖండ దీపం సమీపంలో మహిళలు, భక్తులు భక్తిపార వశ్యంతో కార్తీక దీపాలను వెలిగించారు. కొండపైన ఎటుచూసినా కార్తీక దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోతోంది.

పవిత్ర పర్వదినాన వ్రతాలు ఆచరించే భక్తులు దేవస్థాన అధికారుల సూచనలను పాటిస్తూ, సిబ్బందికి సహకరించాలని ఆలయ వర్గాలు కోరాయి. క్రమశిక్షణతో శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలను పూర్తి చేసుకున్న అనంతరం క్యూలైన్లలో వెళ్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకుని, స్వామివారి దివ్య కృపాకటాక్షాలకు పాత్రులు కావాలని దేవస్థానం ఈవో భవాని శంకర్ విజ్ఞప్తి చేశారు. శివకేశవుల దర్శనం, దీపారాధనలతో తమ యాత్ర సఫలీకృతమైందని భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంప్రదాయ పులివేషం నృత్యంలోని లింగ వివక్ష అడ్డంకులను సవాలు చేసే ఒక యువతి కథను ఆవిష్కరిస్తోన్న 'బాఘుని'

న్యూ ఢిల్లీ, నవంబర్ 24: కొన్ని సంప్రదాయాలు కేవలం గుడ్డిగా అనుసరించడానికి మాత్రమే కాదు వాటితో మమేకమై నాట్యం చేయడానికి కూడా ఉన్నాయని ఒక చిన్నారి భావిస్తే ఎలా ఉంటుంది.. పులి చారలను సంప్రదాయబద్ధంగా పురుషుల శరీరాలపై మాత్రమే చిత్రించే ప్రపంచంలోకి అడుగుపెట్టే ధైర్యం చేసి 'నేనెందుకు చేయకూడదు' అని ఆ బాలిక ప్రశ్నిస్తే ఎలా ఉంటుంది..

ఇది ఒడిశాలోని ఒక మారుమూల గ్రామానికి చెందిన 11 ఏళ్ల బాలిక మిని కథ. ఆమె 'బాఘు నాచ' కళాకారిణి కావాలని కలలు కంటుంది. దీర్ఘకాలంగా పురుషుల ఆధిపత్యం కొనసాగుతున్న సంప్రదాయ పులివేషం నృత్య రూపమైన బాఘు నాచును.. తనదైన శైలిలో స్వీకరించాలని మిని ఆకాంక్షిస్తోంది. ఆమె దృష్టిలో ఈ ఆకాంక్ష కేవలం ఒక నృత్యాన్ని ప్రదర్శించడం మాత్రమే కాదు కలలు కనే స్వేచ్ఛ, సంప్రదాయ కట్టుబాట్లను సవాలు చేయడం, తన అభిరుచిని కొనసాగించడమే.

వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రాన్ని జాతీయ అవార్డు గ్రహీత, నిర్మాత జితేంద్ర మిశ్రా రచించి దర్శకత్వం వహించారు. 'బాఘుని' (బాఘుని- డ్యాన్స్ లైక్ ఏ టైగర్) చిత్రం.. లోతుగా పాతుకుపోయిన లింగ వివక్ష మూసధోరణులను సవాలు చేయాలనే ఒక బాలిక దృఢ సంకల్పాన్ని ఆవిష్కరిస్తోంది. ఒడిశాలోని చైతన్యవంతమైన జానపద సంప్రదాయాల నేపథ్యంలో సాగే ఈ చిత్రం లింగ వివక్ష అడ్డంకులు, సామాజిక కట్టుబాట్లు, సాంస్కృతిక గుర్తింపు, స్థిరపడిన నిబంధనలను ప్రశ్నించే ధైర్యాన్ని అన్వేషిస్తుంది. 2026 నవంబర్ 22న గోవాలో జరిగిన 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఇఫీ) వేదికపై ఈ చిత్రం గాలా ప్రీమియర్ ప్రదర్శన జరిగింది.

విలేకరుల సమావేశంలో జితేంద్ర మిశ్రా మాట్లాడుతూ.. చలనచిత్ర పరిశ్రమలో దాదాపు రెండు దశాబ్దాల ప్రయాణం తర్వాత తన దర్శకత్వ అరంగేట్రంగా నిలిచిన 'బాఘుని' చిత్రాన్ని తనకు వ్యక్తిగతంగా కీలకమైన ఘట్టంగా అభివర్ణించారు. ఇఫీ ఇండియన్ పనోరమాతో తనకు ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ తమకు అందించిన మద్దతుకు గాను ఇఫీ, ఎన్ఎఫ్‌డీసీ, సమాచార- ప్రసార మంత్రిత్వ శాఖలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఈ చిత్రం గురించి జితేంద్ర మిశ్రా మాట్లాడుతూ 'బాఘు నాచ' ఈ చిత్రానికి సాంస్కృతిక నేపథ్యాన్ని అందించినప్పటికీ ఈ కథ అంతిమంగా లింగ సమానత్వం, ధైర్యం, మానవ సంకల్ప బలాన్ని చాటిచెబుతుందని పేర్కొన్నారు. తన సొంత కుటుంబంలోని ఏడుగురు అసాధారణ మహిళల నుంచి ప్రేరణ పొందిన ఆయన బాలికలకు సమాన అవకాశాలు కల్పిస్తే అంచనాలకు మించి రాణించగలరని అన్నారు.

ఒడిశాలోని బెర్హంపూర్‌లో చేసిన విస్తృత పరిశోధన ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆడిషన్ల ద్వారా ఎంపికై ప్రముఖ నటుడు సబ్యసాచి మిశ్రాతో కలిసి పలు నెలల పాటు శిక్షణ పొందిన స్థానిక చిన్నారులు నటించారు.

ప్రఖ్యాత ఒడియా నటుడు సబ్యసాచి మిశ్రా 'బాఘుని' చిత్రాన్ని ఆకట్టుకునే కథాకథనం, ఒడిశా సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం సమ్మేళనంగా అభివర్ణించారు. సంప్రదాయ పులివేషం నృత్యమైన 'బాఘు నాచ' ఆడవులి అనే అర్థం వచ్చే 'బాఘుని' మధ్య ఉన్న వైరుధ్యమే ఈ కథనానికి కేంద్రబిందువని.. ఇది చిత్రానికి మరింత లోతును, ఉత్కంఠను తీసుకొచ్చిందని ఆయన పేర్కొన్నారు.

సంప్రదాయ బాఘు నాచ కళాకారుడి పాత్రను పోషించిన తన అనుభవాన్ని పంచుకున్న సబ్యసాచి.. పాత్రలో సహజత్వం కోసం 30 కిలోల బరువు తగ్గినట్లు, కఠినమైన శారీరక- ఆధ్యాత్మిక సన్నద్ధతను పాటించినట్లు వెల్లడించారు.

ఈ జాన వద కళతో ముడిపడి ఉన్న కఠిన మైన ఆచారాలు, గంటల తరబడి సాగే క్లిష్టమైన శరీర వర్ణచిత్రణ గురించి కూడా ఆయన వివరిం చారు. ఈ కళలో కళాకారుడిని 'మా భగవతి బుద్ధి ఠాకురాణి' దేవత ప్రతిరూపంగా పూజిస్తారని తెలిపారు. ఈ చిత్రానికి అంతర్జాతీయ స్థాయిలో ఆదరణ లభిస్తుందని విశ్వాసం వ్యక్తం చేస్తూ.. ప్రాంతీయ ఒడియా సినిమాకు 'బాఘుని' ఒక కొత్త ప్రమాణాన్ని నిర్దేశించే సామర్థ్యాన్ని కలిగి ఉందని ఆయన అన్నారు. ఈ చిత్ర సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులకు చేరువ చేయాలని మీడియాను ఆయన కోరారు.

'బాఘుని' చిత్రానికి గాలా ప్రీమియర్ గౌరవాన్ని కల్పించి ఒడిశా సాంస్కృతిక వారసత్వాన్ని అంతర్జాతీయ ప్రేక్షకులకు పరిచయం చేసే వేదికను అందించినందుకు ఇఫీ, ఎన్ఎఫ్‌డీసీ, భారత ప్రభుత్వానికి నిర్మాత పార్థ పండా కృతజ్ఞతలు తెలిపారు.

మిని ప్రయాణం ద్వారా 'బాఘుని' చిత్రం లోతుగా పాతుకుపోయిన ఒక స్థానిక సంప్రదాయాన్ని ధైర్యం, గుర్తింపు, సంప్రదాయ కట్టుబాట్లను సవాలు చేసే స్వేచ్ఛ గురించిన మరింత విస్తృత, అంతర్జాతీయ చర్చలోకి తీసుకువస్తోంది. ఇదే స్ఫూర్తితో ఈ చిత్రం ఇఫీ 2026 ఇతివృత్తమైన 'విశ్వజనీయ కథల'తో మమేకమవుతూ స్థానిక గొంతుకలను ప్రపంచ ప్రేక్షకులకు సినిమా ఎలా చేరువ చేయగలదో, ప్రపంచంలోని ఒక మూలన పుట్టిన కథలను మరో ప్రాంతానికి అర్థవంతంగా ఎలా అందించగలదో పునరుద్ఘాటిస్తోంది.

సాంస్కృతిక వారసత్వం, అస్తిత్వం, సామాజిక వాస్తవాలను ఆవిష్కరిస్తున్న ఈశాన్య భారతీయ సినిమాలు - 57వ ఐఎఫ్ఎఫ్ఐలో ప్రత్యేక ఆకర్షణ

న్యూ ఢిల్లీ, నవంబర్ 24: అస్సాంలో తమ సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు కృషి చేస్తున్న సంప్రదాయ చేనేత కళాకారుల సమాజం కథ ఒకటి కాగా, అరుణాచల్ ప్రదేశ్ పర్వత ప్రాంతాల్లో విషాదంలో మునిగిన ఓ తండ్రి మానసిక సంఘర్షణల ప్రయాణం మరొకటి. ఈశాన్య భారతదేశానికి చెందిన ఈ రెండు చిత్రాలు అస్తిత్వం, ప్రతికూల పరిస్థితులను అధిగమించే మనోధైర్యం, మానవ భావోద్వేగాలకు అద్దం పడుతూ 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ)లో ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.

అస్సామీ డాక్యుమెంటరీ చిత్రం 'రెడ్ కార్పెట్' ఇండియన్ పనోరమా నాన్ - ఫీచర్ విభాగంలో ప్రదర్శితమవు తుండగా, 'ఉరుమ్' చిత్రం ఇండియన్ పనోరమ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో పోటు దక్కించుకుంది.

ఐమీ బారువా దర్శకత్వం వహించిన అస్సామీ చిత్రం 'రెడ్ కార్పెట్', దుయు టాబ్యో తెరకెక్కించిన 'ఉరుమ్' చిత్రాల గురించి నేడు గోవాలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా దర్శకులు తమ చిత్రాల విశేషాలతో పాటు, చిత్ర నిర్మాణంలో తమ అనుభవాలు, సినీ ప్రయాణం గురించి వివరిం చారు.

'రెడ్ కార్పెట్' చిత్రం అస్సాంలోని కర్బీ ఆంగ్‌లాంగ్ ప్రాంతంలో నివసించే కర్బీ సమాజానికి చెందిన సంప్రదాయ చేనేత వారసత్వాన్ని ఆవిష్కరిస్తుంది. శతాబ్దాల చరిత్ర కలిగిన ఈ హస్తకళ ఆధునికీకరణ, మారుతున్న జీవనశైలుల కారణంగా ఎదుర్కొంటున్న సవాళ్లను ఈ డాక్యుమెంటరీ వివరిస్తుంది. డోంకమోకామ్ గ్రామానికి చెందిన ఒక సంప్రదాయ చేనేత కళాకారిణి ప్రయాణాన్ని ఈ చిత్రం చూపిస్తుంది. ఆమె చేతితో నేసిన వస్త్రం కేన్స్ చలనచిత్రోత్సవంలోని రెడ్ కార్పెట్ వరకు చేరిన వైనాన్ని చూపిస్తుంది. ఒక సాధారణ చేనేత వస్త్రంగా క్రమంగా ఒక సమాజపు సాంస్కృతిక అస్తిత్వానికి, గర్వానికి, ఆశకు ప్రతీకగా ఎలా మారిందో ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. అవార్డు గ్రహీత, భారతీయ నటి, నిర్మాత, చిత్ర దర్శకురాలు, ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్న ఐమీ బారువా ఈ చిత్రం గురించి తన అభిప్రాయాలను పంచుకుంటూ, అస్సాంలోని ఒక చిన్న గ్రామంలో చేతితో నేసిన సంప్రదాయ వస్త్రాన్ని ప్రతిష్టాత్మక కేన్స్ చలనచిత్రోత్సవం రెడ్ కార్పెట్ వరకు తీసుకెళ్లిన తమ ప్రయాణం గురించి ఆమె వివరించారు.

స్థానిక చేనేత కళాకారుల నైపుణ్యాన్ని, వారి సంప్రదాయ వస్త్రాల్లో ప్రతిబింబించే సాంస్కృతిక అస్తిత్వాన్ని ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆ వస్త్రాలకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం వల్ల ఈ ప్రాంతంలోని స్థానిక సమాజాల సాంస్కృతిక వారసత్వానికి మరింత విస్తృతమైన ఖ్యాతి లభించిందని ఆమె పేర్కొన్నారు.

సంప్రదాయ చేనేత పద్ధతులను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ప్రముఖంగా పేర్కొంటూ, యువత తమ భాష, సంస్కృతి, సంప్రదాయాల పట్ల గర్వం కలిగి ఉండాలని, ఈ వారసత్వాన్ని భావితరాలకు అందించాలని ఆమె పిలుపునిచ్చారు. రెండో చిత్రం దుయు టాబ్యో దర్శకత్వం వహించిన 'ఉరుమ్'. అరుణాచల్ ప్రదేశ్‌లోని మారుమూల పర్వత ప్రాంతంలో నివసించే ఒక తండ్రి విషాద పరిస్థితుల్లో తన చిన్న కుమార్తెను కోల్పోయిన బాధ నుంచి బయట పడేందుకు చేసే ప్రయత్నం నేపథ్యంలో ఈ చిత్రం సాగుతు ంది. దుఃఖం, జ్ఞాపకాలు, స్థానిక సమాజాల విశ్వాసాలను ఈ చిత్రం ఆవిష్కరిస్తుంది. అపరాధ భావన, వెంటాడే దృశ్యాలతో సతమతమవుతున్న ఆ తండ్రి తన మనసుకు శాంతి చేకూర్చే మార్గం కోసం అన్వేషిస్తా డు. మరుగు నపడిన నిజాలు, మానసిక గాయా లు, తన సమాజ ప్రజల జీవితా లను ప్రభావితం చేసే అదృశ్య శక్తుల మధ్య అతను సాగించే అన్వేషణే ఈ చిత్ర కథాంశం.

అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన స్వతంత్ర రచయిత, దర్శకుడు, సాంస్కృతిక కార్యకర్త దుయు టాబ్యో తన చిత్రాల ద్వారా స్థానిక సమాజాల అస్తిత్వం, జ్ఞాపకాలు, సామాజిక వాస్తవాలను ఆవిష్కరిస్తుంటారు. తన బాల్యంలో అరుణాచల్ ప్రదేశ్‌లోని జిరో ప్రాంతంలో కుమార్తెను కోల్పోయిన బాధతో సతమతమవుతున్న ఒక తండ్రిని ప్రత్యక్షంగా చూసిన సంఘటనను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ జ్ఞాపకం ఎన్నో ఏళ్లపాటు తనను వెంటాడిందని, చివరకు అదే ఈ చిత్రానికి పునాదిగా మారిందని తెలిపారు. ఈ చిత్రం ద్వారా నిర్దిష్టమైన నీతిసందేశాన్ని అందించడం కంటే కుమార్తెను కోల్పోయిన తండ్రి మానసిక, భావోద్వేగ స్థితిగతులను ఆవిష్కరించేందుకు ప్రయత్నించినట్లు ఆయన చెప్పారు. ఐఎఫ్ఎఫ్ఐకి కృతజ్ఞతలు తెలిపిన టాబ్యో, ఈ చలన చిత్రోత్సవానికి తన చిత్రం ఎంపిక కావడం అరుణాచల్ ప్రదేశ్‌లో అభివృద్ధి చెందుతున్న చలనచిత్ర పరిశ్రమకు లభించిన గొప్ప గుర్తింపుగా అభివర్ణించారు. ఈ గుర్తింపు రాష్ట్రంలోని మరింత మంది యువ చిత్ర దర్శకులు తమ కథలను తెరకెక్కించేందుకు ప్రోత్సాహాన్ని స్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భాషా, సాంస్కృతిక పరిరక్షణ ప్రాధాన్యతనుస్పష్టం చేస్తూ, స్థానిక నిషి భాషలోనే ఈ చిత్రాన్ని రూపొందించడం వెనుక ప్రత్యేక ఉద్దేశం ఉందని టాబ్యో తెలిపా రు. ఆ భాష సహజత్వాన్ని, ప్రా మాణికతను కాపాడటంతో పాటు దానికి మరింత గుర్తింపు తీసుకు రావాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. యు వతరం క్రమంగా తమ మాతృభా షలకు, స్థానిక భాషలకు దూర మవుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నిషి సమాజ భా షా వారసత్వాన్ని పరిరక్షించే ప్రయత్నంలో భాగంగానే ఈ చిత్రాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు.

ఈశాన్య భారత చలనచిత్ర రంగంలో పెరుగుతున్న అవకాశాల గురించి మాట్లాడుతూ, ప్రపంచానికి అందించగల ఎన్నో విశేషాలు ఉన్నప్పటికీ ఈ ప్రాంతం ఇంకా పూర్తిస్థాయిలో అన్వేషించని సినీ రంగంగా మిగిలిపోయిందని టాబ్యో అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతంపై ప్రధాన ప్రవంతి చిత్ర దర్శకులు, నిర్మాణ సంస్థల్లో ఆసక్తి క్రమంగా పెరుగుతోందని పేర్కొన్నారు. వినోదాన్ని అందించడానికే పరిమితం కాకుండా, సామాజిక చైతన్యాన్ని పెంపొందించడానికి, మార్పును తీసుకురావడానికి కూడా సినిమా ఒక శక్తిమంతమైన మాధ్యమంగా ఉపయోగపడగలదని ఆయన స్పష్టం చేశారు.

"గంగా నది ఒడిలో పరిఢవిల్లిన వేల ఏళ్ల జీవన అనుభవాలు"

ఇఫీలో బనారస్ కోసం ఒక్కటైన భరత్ బాలా, ఏ.ఆర్. రెహమాన్

న్యూఢిల్లీ, నవంబర్ 24: ప్రముఖ చిత్ర నిర్మాత భరత్ బాలా, సంగీత మాంత్రికుడు ఏ.ఆర్. రెహమాన్‌తో కలిసి బనారస్ చిత్రం కోసం మరోసారి పనిచేశారు. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రం గోవాలో జరిగే 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం ఇఫీలోని ఇండియన్ పనోరమా విభాగానికి ఎంపికైంది. భారత్‌లో తొలిసారిగా ఈ వేదికపై ఈ చిత్రాన్ని ప్రదర్శించనున్నారు. అభిషేక్ బెనర్జీ, షహీనా గోస్వామి, నీరజ్ కబీ, ఛాయా కదమ్, ఇందిరా తివారీ, ఆంటోనీధానన్ జేనుధానన్ తదితరులు ఈ చిత్రంలో ప్రధాన పాత్రలు పోషించారు.

భారత శాస్త్రీయ సంగీత సాంస్కృతిక నేపథ్యంలో రూపొందిన బనారస్ చిత్రం... తండ్రీకూతుళ్ల మధ్య అనుబంధం, సంగీత వారసత్వం, తరతరాలుగా కొనసాగే శాశ్వత బంధాలను ఆవిష్కరిస్తుంది. దర్శకుడు భరత్ బాలా అభివర్ణించినట్లుగా... "గంగా నది నిత్య చైతన్య స్ఫూర్తి" నేపథ్యంలో ఈ కథ సాగుతుంది.

చిత్ర సంగీతం గురించి ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ మాట్లాడారు. హిందుస్తానీ, కర్ణాటక సంగీతాలతో సృజనాత్మక ప్రయాణంలో భారతీయ శాస్త్రీయ సంగీతం నిరంతర స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. సంగీతాన్ని వ్యక్తపరిచే తీరుని రాగాలు, వాటితో ముడిపడి ఉన్న భావోద్వేగాలు నిరంతరం తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు.

చిత్ర సంగీతం పట్ల తన దృక్పథాన్ని వివరిస్తూ... స్వరకల్పనలో రాగాలను మేళవించటం గురించి రెహమాన్ మాట్లాడారు. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తుచేసుకుంటూ... అది సంగీత అన్వేషణకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని అన్నారు. "నేను ప్రతి సంస్కృతిని ఆస్వాదిస్తాను" అని తెలిపారు. పంజాబీ భాషలోని శక్తివంతమైన గుణం నుంచి బెంగాలీలోని మాధుర్యం వరకు ప్రతి భాషకూ ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. తన సంగీతంలో వివిధ భాషలు, వాటి సాంస్కృతిక సారాంశాలు పరస్పరం సమ్మిళితమయ్యేలా నిరంతరం కృషి చేస్తారని చెప్పారు.

మరియన్ చిత్రం తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం తిరిగి పూర్తిస్థాయి చలనచిత్ర నిర్మాణంలోకి రావటం గురించి భరత్ బాలా మాట్లాడారు. ఈ మధ్య కాలంలో పలు లఘు చిత్రాలకు పనిచేసినట్లు వెల్లడించారు. తప్పనిసరిగా చెప్పాల్సిన కథ ఎదురైనప్పుడు చేపట్టే సృజనాత్మక ప్రక్రియకు కొనసాగింపుగా చలనచిత్ర నిర్మాణాన్ని భావిస్తానని తెలిపారు.

బనారస్ నగరాన్ని తెరపై అనేక కోణాల్లో ఆవిష్కరిం చినప్పటికీ, ఆ నగరం గురించి తెలుసుకోవాల్సినది ఇంకా ఎంతో ఉందని బాలా అన్నారు. "గంగా నది ఒడిలో పరిఢవిల్లిన వేల ఏళ్ల జీవన అనుభవాలతో రూపుదిద్దుకున్న ప్రదేశం"గా ఆ నగరాన్ని అభివర్ణించారు.

కాంతి, కెమెరా కోణాలు, ఫ్రేమింగ్, అమరిక సాయంతో నటీనటుల ముఖాల్లోని "భావోద్వేగా లను ఒడిసిపట్టటమే" ప్రధాన లక్ష్యమని సినిమాటోగ్రాఫర్ మార్క్ కొనింక్స్ పేర్కొన్నారు. కేవలం బయటి వ్యక్తులుగా ప్రేక్షకులు సినిమాను చూడకుండా... తాము కూడా అందులో భాగమనే అనుభూతిని కలిగించటమే తమ ఉద్దేశమని ఆయన తెలిపారు.

చిత్ర సంగీతం గురించి ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ మాట్లాడారు. హిందుస్తానీ, కర్ణాటక సంగీతాలతో సృజనాత్మక ప్రయాణంలో భారతీయ శాస్త్రీయ సంగీతం నిరంతర స్ఫూర్తిదాయకంగా నిలిచిందని పేర్కొన్నారు. సంగీతాన్ని వ్యక్తపరిచే తీరుని రాగాలు, వాటితో ముడిపడి ఉన్న భావోద్వేగాలు నిరంతరం తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు.

చిత్ర సంగీతం పట్ల తన దృక్పథాన్ని వివరిస్తూ... స్వరకల్పనలో రాగాలను మేళవించటం గురించి రెహమాన్ మాట్లాడారు. భారతదేశ సాంస్కృతిక వైవిధ్యాన్ని గుర్తుచేసుకుంటూ... అది సంగీత అన్వేషణకు నిరంతరం స్ఫూర్తినిస్తుందని అన్నారు. "నేను ప్రతి సంస్కృతిని ఆస్వాదిస్తాను" అని తెలిపారు. పంజాబీ భాషలోని శక్తివంతమైన గుణం నుంచి బెంగాలీలోని మాధుర్యం వరకు ప్రతి భాషకూ ప్రత్యేకత ఉంటుందని తెలిపారు. తన సంగీతంలో వివిధ భాషలు, వాటి సాంస్కృతిక సారాంశాలు పరస్పరం సమ్మిళితమయ్యేలా నిరంతరం కృషి చేస్తారని చెప్పారు.

మరియన్ చిత్రం తర్వాత సుదీర్ఘ విరామం అనంతరం తిరిగి పూర్తిస్థాయి చలనచిత్ర నిర్మాణంలోకి రావటం గురించి భరత్ బాలా మాట్లాడారు. ఈ మధ్య కాలంలో పలు లఘు చిత్రాలకు పనిచేసినట్లు వెల్లడించారు. తప్పనిసరిగా చెప్పాల్సిన కథ ఎదురైనప్పుడు చేపట్టే సృజనాత్మక ప్రక్రియకు కొనసాగింపుగా చలనచిత్ర నిర్మాణాన్ని భావిస్తానని తెలిపారు.

బనారస్ నగరాన్ని తెరపై అనేక కోణాల్లో ఆవిష్కరిం చినప్పటికీ, ఆ నగరం గురించి తెలుసుకోవాల్సినది ఇంకా ఎంతో ఉందని బాలా అన్నారు. "గంగా నది ఒడిలో పరిఢవిల్లిన వేల ఏళ్ల జీవన అనుభవాలతో రూపుదిద్దుకున్న ప్రదేశం"గా ఆ నగరాన్ని అభివర్ణించారు.

కాంతి, కెమెరా కోణాలు, ఫ్రేమింగ్, అమరిక సాయంతో నటీనటుల ముఖాల్లోని "భావోద్వేగా లను ఒడిసిపట్టటమే" ప్రధాన లక్ష్యమని సినిమాటోగ్రాఫర్ మార్క్ కొనింక్స్ పేర్కొన్నారు. కేవలం బయటి వ్యక్తులుగా ప్రేక్షకులు సినిమాను చూడకుండా... తాము కూడా అందులో భాగమనే అనుభూతిని కలిగించటమే తమ ఉద్దేశమని ఆయన తెలిపారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలు

పోటీల బ్రోచర్‌ను విడుదల చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి
డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు



నల్గొండ, నవంబర్ 24: స్టేషన్ ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీల బ్రోచర్‌ను స్థానిక ఎమ్మెల్యే, మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి విడుదల చేశారు. ఎమ్మెల్యే నివాస ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవాణి గురుకులంలో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలను నిర్వహించనున్నారు. సీనియర్ పురుషులు, మహిళల విభాగాల్లో ఈ పోటీలు జరగనున్నాయి. పోటీల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు, ప్రచార కార్యక్రమాల్లో భాగంగా బ్రోచర్‌ను విడుదల చేశారు.

ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ సోదరపల్లి సంపత్ రాజు, షూటింగ్ బాల్ అసోసియేషన్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపు సుమలత కుమార్, ఎస్సీ సెల్ జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐలపాక శ్రీనివాస్, పీడీలు దేవునింగ్, సుధాకర్, దిలీప్ కుమార్, చందర్, షూటింగ్ బాల్ సలహా సంఘం సభ్యుడు భాస్కుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 25న ప్రారంభం కానున్న నయీ చేతన 5.0

న్యూ ఢిల్లీ, నవంబర్ 24:మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న జాతీయ లింగ సమానత్వ ప్రచార కార్యక్రమం 'నయీ చేతన – పహల్ బద్లావ్ కీ' అయిదో విడత 2026 నవంబర్ 25న ప్రారంభం కానుంది. దీన్‌దయాల్ అంత్యోదయ యోజన?జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) పరిధిలో నెల రోజుల పాటు జరిగే ఈ ప్రచార కార్యక్రమం 2026 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు దేశవ్యాప్తంగా అమలవుతుంది.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణ దేవి సమక్షంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేష్ పాశ్వాన్, ఈ ప్రచారంలో భాగస్వామ్యం పంచుకుంటున్న మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వాములు, దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక సంస్థల మహిళా నాయకులు కూడా హాజరవుతారు.

ఈ కార్యక్రమం జరిగే ప్రదేశం భారత రత్న సీ సుబ్రమణ్యం ఆడిటోరియం, ఎన్ఏఎస్‌సీ కాంప్లెక్స్, దేవ్ ప్రకాశ్ శాస్త్రి మార్గ్, పూసా, న్యూఢిల్లీ?110012. మధ్యా హ్నం రెండు గంటలకు ప్రారంభమ వుతుంది.

నయీ చేతన 5.0 ఇతివృత్తం ? "అవకాశం నుంచి స్వీయ నిర్ణయాధికారం వరకు: వికసిత భారత్ కోసం జీవనోపాధి, నమాన అవకాశాల ద్వారా మహిళా సాధికారత''. ఇది ఆర్థిక సాధికారత, జీవనోపాధిలో భాగస్వామ్యం, స్వతంత్ర నిర్ణ యాలు తీసుకోవడంలో అవకాశాలు, రవాణా సౌకర్యాలు మహిళలకు అందుబాటులో ఉ ండాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది.

నయీ చేతన 5.0 విధానంలో ప్రధానా ంశంగా మహిళల ఆర్థిక సాధికారత ఉంది. ఈ విధానం పరస్పరం అనుసంధానమై ఉ న్న నాలుగు రంగాలపై దృష్టి సారిస్తుంది. అవి... మహిళలను ఆర్థిక భాగస్వాములుగా గుర్తించడం, ఆస్తులపై మహిళల హక్కులు ? వాటిపై వారికున్న నియంత్రణను బలోపేతం చేయడం, సురక్షితమైన రవాణా సౌకర్యాలను ప్రోత్సహించడం, వేతనం లేని సంరక్షణ పనిని పునఃపంపిణీ చేయడం. జీవనోపాధి అవకాశాలను, మార్కెట్లను, ఆర్థిక సేవలను, బహిరంగ ప్రదేశాలను, అత్యవసం ైమైన సేవలను పొందడంతో పాటు స్వేచ్ఛగా, సురక్షితంగా, స్వతంత్రంగా ప్రయాణించడంలో మహిళలకు ఎదురవుతున్న అవరోధాలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. అవగాహనను కల్పించడంతో పాటుగా మహిళల ఆర్థిక భాగస్వామ్యం, ఏజెన్సీ, నిర్ణయాధికారంలో సమన్వయ చర్యలు చేపట్టి, కొలవదగిన మెరుగుదలలు సాధించడమే ఈ ప్రచారం లక్ష్యం.

15 మంత్రిత్వ శాఖలు/విభాగాలు భాగ స్వామ్యం పంచుకొనే సంయుక్త అంతర-మంత్రిత్వ శాఖల అడ్వయిజరీని విడుదల చేయడం ఈ జాతీయ ప్రచారం ప్రారంభ కార్యక్రమంలో ప్రధానమైనది. సమన్వయ చర్య, ఏకీకరణ ద్వారా నయీ చేతన 5.0 లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లా లనే ఉమ్మడి నిబద్ధతను ఈ అడ్వయిజరీ ప్రతిబింబిస్తుంది. ఈ ప్రచారం లక్ష్యాలతో తమ పథకాలను, కార్యక్రమానలను, సంస్థాగత యంత్రాం గాలను, క్షేత్రస్థాయి వ్యవస్థలను సమన్వయం చేసుకొనేందుకు అవసరమైన విధివిధానాలు మంత్రిత్వశాఖలు, విభాగాలకు ఈ అడ్వయి జరీ అందిస్తుంది. అలాగే జాతీయ, రాష్ట్ర, జిల్లా, కమ్యూనిటీ స్థాయుల్లో సమన్వయ చర్య లను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా మహిళలకు జీవనోపాధి, ఆస్తులు, ఆర్థిక సేవలు, సురక్షిత రవాణా, అవసరమైన సేవ లు, సంస్థాగత సహకారాన్ని మరింత అందు బాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తుంది.

ఈ కార్యక్రమంలో, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ శాఖ, జాతీయ న్యాయ సేవల అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ)ల మధ్య హింసారహిత గ్రామ కార్యక్రమంపై కుదిరిన నాలుగు పక్షాల అవగాహన ఒప్పందాన్ని కూడా విడుదల చేస్తారు. సమాజంలో లింగ ఆధారిత హింసను నివారించే, స్పందించే సమన్వయ సంస్థాగత చర్యలకు అవసరమైన విధివిధానాలను ఈ ఎంవోయూ అందిస్తుంది. చట్టపరమైన హక్కులపై అవగాహన, న్యాయం పొందే అవకాశం, సంస్థాగత మద్దతు, హింస లేని గ్రామాలను నిర్మించే దిశగా సామూహిక చర్యలతో సహా, సామాజిక సంస్థలు, న్యాయ సేవల అధికారులు, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే దీని ఉద్దేశం.

స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్ జీలు), గ్రామ సంస్థలు (వీవోలు), క్లస్టర్ స్థాయి సమాఖ్యలు (సీఎల్ఎఫ్‌లు), జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీలు), ఇతర సామాజిక సంస్థలతో కూడిన డీఏవై ఎన్ఆర్ఎల్ఎం విస్తృత వ్యవస్థ... నయీ చేతన 5.0 అమల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రారంభోత్సవంలో సేవలు, హక్కులు, సహాయక వ్యవస్థలు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను సులభంగా పొందేందుకు వీలుగా కమ్యూనిటీ స్థాయి వేదికలుగా నూతన జెండర్ రీసోర్స్ కేంద్రాలను కూడా ప్రారం భిస్తారు. మహిళల సమష్టి చర్యలను, నాయక త్వాన్ని బలోపేతం చేయడంపై తమ అనుభ వాలను, ఆవిష్కరణలను వివిధ రాష్ట్రాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళా నాయకులు పంచుకుంటారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రెండు ప్యానెల్ చర్చలను నిర్వహిస్తారు. "జెండర్ రీసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీలు), వన్ స్టాప్ సెంటర్లు (ఓఎస్‌సీలు), లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎల్ఎస్ఏ), ఆరోగ్య వ్యవస్థ ద్వారా మంత్రిత్వ శాఖల సమన్వయాన్ని ముందుకు తీసుకెళ్లడం" అనే అంశంపై మొదటి ప్యానెల్ చర్చ జరుగుతుంది. దీనిలో సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. దీనిలో మహిళల సమస్యలపై సమన్వయాన్ని, ఉమ్మడి కార్యాచరణను బలోపేతం చేయడంపై చర్చిస్తారు. ''క్షేత్రస్థాయి మహిళా నాయకులు: అనుభవాలు, ఆవిష్కరణలు, ముందున్న మార్గం'' అనే అంశంపై రెండో ప్యానెల్ చర్చ నిర్వహిస్తారు. ఇది తమ అనుభవాలను, సిఫారసులను పంచుకొనే వేదికను క్షేత్రస్థాయి మహిళా నాయకులకు అందిస్తుంది.

జాతీయ ప్రారంభోత్సవం సందర్భంగా నయీ చేతన 4.0 మదింపు నివేదికను విడుదల చేయనున్నారు. మునుపటి విడతలో ఈ కార్యక్రమ పనితీరు మదింపును, అందులో నేర్చుకున్న ముఖ్యమైన అంశాలను ఈ నివేదిక వివరిస్తుంది. భవిష్యత్ ప్రచార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి, బలోపేతం చేయడానికి ఈ అంశాలు ఉపయోగపడతాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి వీడియోల ప్రదర్శన, ఉత్తమ విధానాలపై ప్రజె ంటేషన్లు కూడా ఉంటాయి. లింగ సమానత్వం దిశగా సామాజిక భాగస్వా మ్యంతో చేపడుతున్న కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలను ఇవి తెలియజేస్తాయి. ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన వీడియోల ను కూడా ఈ సందర్భంగా విడుదల చేస్తారు.

నయీ చేతన కార్యక్రమాన్ని గ్రామీణా భివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం 2022లో ప్రారంభించింది. ఈ కార్యక్రమం మొదలైన నాటి నుంచి లింగ ఆధారిత హింస (జీబీవీ)ను పరిష్కరించే, వివక్షాపూరితమైన సామాజిక కట్టుబాట్లను నవాలు చేసే, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే జాతీయ స్థాయి సామాజిక ఉ ద్యమంగా రూపుదిద్దుకుంది.

ఎన్ఎఫ్ఎస్‌సీ ఫెలోషిప్ సాయంతో ఉన్నత విద్యకు ఊతం

న్యూ ఢిల్లీ, నవంబర్ 24:అర్హులైన పరిశోధక విద్యార్థులలో కొందరికి అయినా సాయాన్ని అందిస్తే ఉన్నత విద్యను అభ్యసించడానికి, పరిశోధన మార్గంలో ముందుకు పోవడానికి, మరింత ఆర్థిక స్థిరత్వాన్ని సంతరించుకోవడానికి, వృత్తిపరంగా మంచి అవకాశాన్ని చేజిక్కించుకోవడానికి దోహదం చేసినట్లవుతుందనడానికి శ్రీ రాజు (పేరు మార్చాం) జీవన గాథే అద్దం పడుతుంది.

ఉన్నత విద్యను అభ్యసించడంలో విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తే వారు తమ పరిశోధనను దీక్షగా కొనసాగించి, విద్యానైపుణ్యాలకు సాన పట్టుకొని, దీర్ఘకాలిక వృత్తిపరమైన ఆకాంక్షల్ని నెరవేర్చుకొనే దిశగా దూసుకుపోగలుగుతారు. మరీ ముఖ్యంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవడం వారి అవకాశాలకు ఒక గిరిని గీస్తాయి.

శ్రీ రాజు వయసు 36 ఏళ్లు. తెలంగాణలో సిద్దిపేట జిల్లాకు చెందిన విద్యార్థి. పీహెచ్‌డీ చదువుతున్నారు. ఆయనకు విద్యారంగ ప్రవేశం ఆర్థిక కష్టాలతో పాటు, కుటుంబపరంగా గడ్డు పరిస్థితులు కూడా ఎదురయ్యాయి. ఒక నిరుద్యోగ విద్యార్థిగా తన పరిశోధనను కొనసాగించడంలోను, విద్యలో తాను పెట్టుకున్న లక్ష్యం దిశగా సాగడంలోను ఆయనకు సవాళ్లు తటస్థించాయి.

పీహెచ్‌డీని పూర్తి చేయాలని, అసిస్టెంట్ ప్రొఫెసర్ గానో లేదా రాష్ట్ర సేవలో గ్రూప్-వన్ అధికారి గానో ఎదగాలని భావించారు శ్రీ రాజు. తనకు కొన్ని చిక్కులు ఎదురైనప్పటికీ, విద్యాభ్యాసాన్ని కొనసాగించాలని ఆయన కోరుకున్నారు. షెడ్యూల్డు కులాల విద్యార్థులకు అందించే జాతీయ ఫెలోషిప్ (ఎన్ఎఫ్ఎస్‌సీ)లో భాగంగా 2022 నవంబర్ నుంచి ఆయనకుసహాయం అందడం మొదలైంది. దీంతో ఇంటి అద్దె అలవెన్సు (హెచ్ఆర్ఏ), ఆకస్మిక సహాయం సమకూరాయి.

రూ.15 లక్షల మేర సహాయం లభించడంతో, ఆయన తన పరిశోధన తాలూకు పనిపై దృష్టిని కేంద్రీకరించి సమాచార సేకరణలో జోరును పెంచి, సాఫ్ట్ స్కిల్స్‌కు పదును పెట్టుకున్నారు. తనకు ఎదురైన ఆర్థిక క్లిష్ట స్థితులను శ్రీ రాజు అధిగమించడంతో పాటు, కుటుంబ ఆర్థిక పరిస్థితులను మెరుగుపరచడంలోను ఈ సాయం దోహదం చేసింది.

ఈ ఫెలోషిప్ మంజూరు కావడంతో ఆయన విద్యాజీవితంలోను, వ్యక్తిగత జీవితంలోను సానుకూల మార్పులు చోటు చేసుకున్నాయి. దీంతో ఆయన తన పరిశోధనను ముగించి, భావి వృత్తిజీవిత ఆకాంక్షలను నెరవేర్చుకొనే దిశగా నిలకడగా ముందుకు సాగిపోయేందుకు ఈ ఫెలోషిప్ తోడ్పడింది.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా యువ సంవాద్‌ను నిర్వహిస్తున్న మై భారత్

న్యూ ఢిల్లీ, నవంబర్ 24:రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మేరా యువ భారత్ (మై భారత్) ద్వారా 2026 నవంబర్ 24 నుంచి 26 వరకు దేశవ్యాప్తంగా 'వికసిత్ భారత్ యువ సంవాద్' కార్యక్రమాన్ని కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ నిర్వహించనుంది. 30కి పైగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 600కు పైగా జిల్లాల్లో ఉన్న 500కు పైగా కళాశాలల్లో ఈ కార్యక్రమం జరుగుతుంది. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే క్రమంలో యువతను క్రియాశీల భాగస్వాములుగా ప్రోత్సహిస్తూ... దేశ అభివృద్ధి ప్రస్థానం, సాధించిన విజయాలు, భవిష్యత్ ఆకాంక్షలతో 15-29 ఏళ్ల వయసు గల యువతను ఏకతాటిపైకి తీసుకురావటమే ఈ జాతీయ స్థాయి కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

రాజ్యాంగ దినోత్సవ స్ఫూర్తికి అనుగుణంగా వివిధ విద్యా సంస్థల్లోని విద్యార్థులు, యువత సామూహికంగా భారత రాజ్యాంగ పీఠికను పఠిస్తూ, రాజ్యాంగ విలువలు, ఆదర్శాల పట్ల నిబద్ధతను తెలియజేస్తారు. భారతదేశ పురోగతి, నూతనంగా వస్తున్న అవకాశాలు, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దటంలో తమ పాత్రపై యువత ఆలోచించేలా ప్రోత్సహించేందుకు ఇంటరాక్టివ్ సంభాష ణలు, అవగాహన సదస్సుల ద్వారా ఈ కార్యక్రమం జాతీయ వేదికగా నిలుస్తుంది.

ఈ దార్శనికతను క్షేత్రస్థాయిలో అర్థవంతమైన భాగస్వామ్యంగా మార్చేందుకు, ఇందులో భాగస్వాములవుతున్న విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రముఖ యువ ఐకాన్లు ప్రత్యేక సదస్సులకు నాయకత్వం వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి యువ ఐకాన్ 'వికసిత్ భారత్ ఏ2047' ఇతివృత్తంపై ప్రత్యేకంగా రూపొందించిన ప్రజెంటేషన్‌ను అందిస్తారు. దీనిద్వారా భారతదేశ అభివృద్ధి ప్రయాణం, ఇటీవలి సంవత్సరాల్లో సాధించిన విజయాలు, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలనే ఆకాంక్షల గురించి విద్యార్థులకు వివరిస్తారు. సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ద్వారా కోట్లాది మంది ప్రజల జీవితాలను, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు చేస్తున్న కృషితో పాటు పేదరిక నిర్మూలన, సామాజిక-ఆర్థిక పరివర్తనలో దేశం సాధించిన ప్రగతిని ఈ ప్రజెంటేషన్ ప్రధానంగా వివరిస్తుంది. నక్సలిజాన్ని నియంత్రించటం, శాంతిని పునరుద్ధరించటం, గతంలో ప్రభావితమైన ప్రాంతాల్లో అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించటం, భారతదేశం సాధించిన గణనీయమైన పురోగతిని కూడా ఇది ప్రముఖంగా చాటిచెబుతుంది. ఆరోగ్యకరమైన, సాధికారత గల, వ్యసన రహిత సమాజాన్ని నిర్మించాల్సిన ఆవశ్యకతను ఇది స్పష్టం చేస్తుంది. మాదకద్రవ్యాల వినియోగం వ్యక్తిగత సామర్థ్యాన్ని, కుటుంబ సంక్షేమాన్ని, సామాజిక పురోగతిని, జాతీయ ఉత్పాదకతను ఏ విధంగా దెబ్బతీస్తుందో ఇది వివరిస్తుంది. వికసిత్ భారత్ ఏ2047 కలను సాకారం చేసుకునేందుకు నషా ముక్త్ భారత్ అత్యంత కీలకమని, ఈ పరివర్తనను ముందుకు నడిపించటంలో యువత నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుందని ఈ ప్రజెంటేషన్ స్పష్టం చేస్తుంది.

ఈ చర్చలకు మరింత ప్రాముఖ్యతను జోడిస్తూ పద్మ పురస్కార గ్రహీతలు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి జీవిత ప్రయాణాలు, వ్యక్తిగత అనుభవాలు, ఆలోచనలను పంచుకుంటారు. ఈ సందర్భంగా వారు అధిగమించిన సవాళ్లు, సాధించిన కీలక విజయాలు, తమ ప్రయాణానికి మార్గనిర్దేశం చేసిన విలువలను ప్రత్యేకంగా వివరిస్తారు. వారి అనుభవాల నుంచి స్ఫూర్తి పొందేందుకు, దేశ నిర్మాణంలో అంకితభావం, పట్టుదల, నిబద్ధతల ప్రాముఖ్యతను అర్థం చేసుకునేందుకు ఈ ముఖాముఖి కార్యక్రమాలు యువతకు అవకాశాన్ని కల్పిస్తాయి.

వికసిత్ భారత్ ఏ2047 లక్ష్యాన్ని సాకారం చేయటంలో యువశక్తి కీలక పాత్ర పోషించాలని 2023 ఆగస్టు 15న ఎర్రకోట వద్ద ప్రసంగిస్తూ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆయన దార్శనికత నుంచి స్ఫూర్తి పొంది ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. అమృత తరాన్ని దేశ నిర్మాణంలో కీలక శక్తిగా గుర్తిస్తూ... ఈ జాతీయ దార్శనికతను సాధించే దిశగా యువ శక్తిని, నాయకత్వ లక్షణాలను మళ్లించటమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

వికసిత్ భారత్ ఏ2047 దార్శనికతను కార్యరూపంలోకి తీసుకువచ్చేందుకు, రిజిస్ట్రేషన్లు, కార్యక్రమ సంబంధిత కార్యకలాపాల కోసం మై భారత్ పోర్టల్ ఒక డిజిటల్ వేదికగా పనిచేస్తుంది. ఇది యువతకు విస్తృత భాగస్వామ్యాన్ని కల్పించటంతో పాటు మై భారత్ వ్యవస్థలో యువతను భాగస్వాము లను చేసేందుకు దోహదపడుతుంది. సంస్థాగత అనుసంధానం, డిజిటల్ భాగస్వా మ్యాన్ని నమ్మిళితం చేయటం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న యువతకు భాగస్వామ్య అవకాశాలను విస్తరించటం, స్వచ్ఛంద సేవా కార్యక్రమాలను చేపట్టేలా వారిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

ఈ కార్యక్రమం ద్వారా భాగస్వామ్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో నిరంతర సంస్థాగత అనుబంధం కూడా ఏర్పడుతుంది. యువత నిరంతర భాగస్వామ్యాన్ని సులభతరం చేసేందుకు, స్వచ్ఛంద సేవా స్ఫూర్తిని ప్రోత్సహించేందుకు, భవిష్యత్తులో చేపట్టే మై భారత్ కార్యక్రమాల అమలుకు మద్దతిచ్చేందుకు ఈ విద్యాసంస్థల్లో తదుపరి మై భారత్ విభాగాలను ఏర్పాటు చేసే అవకాశముంది. ఈ కార్యక్రమానికి అతీతంగా భాగస్వామ్యం, నాయకత్వం, సేవా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లగల సామాజిక బాధ్యత, స్ఫూర్తి కలిగిన యువ పౌరుల వ్యవస్థను తీర్చిదిద్దేందుకు ఇది ఎంతగానో తోడ్పడుతుంది.

'వికసిత్ భారత్ యువ సంవాద్' ద్వారా వికసిత్ భారత్ ఏ2047 జాతీయ దార్శనికత దిశగా అమృత తరం శక్తిని, ఆలోచనలను, సామర్థ్యాన్ని మళ్లించేందుకు మై భారత్ కృషి చేస్తోంది. నమ్మిళిత వృద్ధి, సామాజిక పరివర్తన, శాంతి భద్రతలు, పౌరుల సాధికారత పునాదులుగా అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ప్రయాణం కొనసాగుతోంది. మాదకద్రవ్య రహిత భారత్.. కేవలం ఒక సామాజిక ఆకాంక్ష మాత్రమే కాదు, ప్రతి యువ పౌరుడి క్రియాశీల భాగస్వామ్యాన్ని కోరే జాతీయ ఆవశ్యకత. 'వికసిత్ భారత్ కోసం నషా ముక్త్ యువ' సందేశంతో అవగాహనను కార్యాచరణగా, సంవాదాన్ని దృఢ సంకల్పంగా, యువత భాగస్వామ్యాన్ని దేశవ్యాప్త పరివర్తన ఉద్యమంగా మార్చాలని ఈ కార్యక్రమం లక్ష్యంగా పెట్టుకుంది.

ఈ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత యువత ఏకమై రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించాలని, రాజ్యాంగంలో పొందుపరిచిన ఆదర్శాల పట్ల నిబద్ధతను స్పష్టం చేయాలని, మరింత ఆరోగ్యకరమైన, బలమైన, మాదకద్రవ్య రహిత భారత్ కోసం గళమెత్తాలని మై భారత్ పిలుపునిస్తోంది. వికసిత్ భారత్ ఏ2047 దిశగా సాగే ప్రయాణం యువత ఆకాంక్షలతో పాటు వారు ఎంచుకునే మార్గాలు, తీసుకునే చర్యలపై ఆధారపడి ఉంటుంది.

ఇఫీలో ప్రేక్షకుల మనసులను తాకిన 'రహ్మే', 'ది ఫామ్' సినిమాలు



న్యూఢిల్లీ, నవంబర్ 24: మాతృత్వం, కరుణ, మానవుల బలహీనతలు, ప్రాణం విలువ వంటి అంశాలు గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ)లో భాగంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రధానంగా చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ సినిమా విభాగంలో ప్రదర్శితమైన రెండు చిత్రాలకు సంబంధించిన దర్శకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 'రహ్మే', 'ది ఫార్మ్' చిత్రాలు విభిన్నమైనప్పటికీ, ఒకదానితో మరొకటి లోతైన సంబంధం కలిగిన ఇతివృత్తాలను ఆవిష్కరిస్తాయి. వ్యక్తిగత సమస్యలు, కష్టాల పరిధిని దాటి, ఇతరుల బాధలను, ఆకాంక్షలను కూడా అర్థం చేసుకోవాలని ఈ చిత్రాలు ప్రేక్షకులకు పిలుపునిస్తాయి.

ఈ విలేకరుల సమావేశంలో 'రహ్మే' చిత్ర రచయిత, దర్శకుడు ఫైసల్ సోయ్‌సాల్, 'ది ఫార్మ్' చిత్ర రచయిత, దర్శకురాలు ఎలిఫ్ ఎడా, ఆ చిత్ర ఛాయాగ్రాహకుడు ఎమ్రే పెక్‌చాకిర్ పాల్గొన్నారు.

ఈ హృద్యమైన కథలను వెండితెరపై ఆవిష్కరించడానికి వెనుక ఉన్న సృజనాత్మక దృక్పథం, ప్రధాన ఇతివృత్తాలు, చిత్ర నిర్మాణ సమయంలో ఎదురైన అనుభవాలను దర్శకులు ఈ సందర్భంగా పంచుకున్నారు.

ఫైసల్ సోయ్‌సాల్ స్వీయ రచన, దర్శకత్వంలో తెరకెక్కిన 'రహ్మే' చిత్రం మాతృత్వం కోసం తపించే పురావస్తు శాస్త్రవేత్త మెర్యెమ్ భావోద్వేగ ప్రయాణాన్ని ఆవిష్కరి స్తుంది.

పలు శస్త్రచికిత్సలు, ఐవీఎఫ్ ప్రయత్నాలు విఫలమై నిరాశలో కూరుకుపోయిన ఆమె భర్త ఇబ్రహీం అయిష్టతను కాదని జార్జియాలో సరోగసీ వైపు మొగ్గు చూపుతుంది. సరిగ్గా అదే సమయంలో, జీవనం కోసం ఒంటరి పోరాటం చేస్తున్న తొమ్మిదేళ్ల సిరియన్ అనాథ చిన్నారి రహ్మే తారసపడటంతో మెర్యెమ్ జీవిత గమనం మారిపోతుంది. ఆ చిన్నారి దీనస్థితిని అర్థం చేసుకున్న మెర్యెమ్‌కు, రహ్మేకు మధ్య ఏర్పడిన విడదీయరాని బంధం ఆమె వేదనకు ఊరటనిచ్చి, మనసుకు స్వాంతన కలిగిస్తుంది.

చిత్రానికి ప్రేరణ కలిగించిన అంశాల గురించి వివరిస్తూ, పిల్లలు కావాలన్న ఆకాంక్షతో దంపతులు తీవ్రంగా పోరాడుతుంటే, మరోవైపు ఎంతోమంది పిల్లలు కుటుంబ ఆదరణ లేకుండానే పెరుగుతున్నారన్న ఆలోచన నుంచి ఈ కథ పుట్టుకొచ్చిందని ఫైసల్ సోయ్‌సాల్ తెలిపారు. 'రహ్మే' చిత్రం ద్వారా తల్లిదండ్రుల బాధ్యతలోని భావోద్వేగ సంక్లిష్టతలను, కుటుంబం అనే పదానికి గల అసలైన అర్థాన్ని, అలాగే లోతైన మానసిక అవసరాలను మానవ సంబంధాలు ఊహించని రీతిలో ఎలా తీర్చగలవో అన్వేషించడానికి తాను ప్రయత్నించానని ఫైసల్ సోయ్‌సల్ వివరించారు.

ఎలిఫ్ ఎడా రచించి దర్శకత్వం వహించిన 'ది ఫార్మ్' చిత్రం 12 ఏళ్ల ఇరెమ్ కథను ఆవిష్కరిస్తుంది.

తల్లిదండ్రులను అకస్మాత్తుగా కోల్పోయిన ఆమె తనకు దూరంగా ఉంటున్న నాయనమ్మతో కలిసి ఒక పాడి వ్యవసాయ క్షేత్రంలో నివసించాల్సి వస్తుంది. పాల ఉ త్పత్తిని పెంచేందుకు అప్పుడే పుట్టిన దూడలను వాటి తల్లుల నుంచి వేరు చేసే పద్ధతిని చూసి ఇరెమ్ కలత చెందుతుంది. తాను ప్రత్యక్షంగా చూస్తున్న ఈ క్రూరత్వాన్ని ఆమె ఏమాత్రం జీర్ణించుకోలేకపోతుంది. పశు వైద్యుడి వద్ద శిక్షణార్థిగా పనిచేస్తున్న అనాథ బాలుడు హాలిద్ సహాయంతో గర్భంతో ఉ న్న ఆవులను విడిపించేందుకు ఆమె ఎంతో పట్టుదలతో ప్రయత్నాన్ని ప్రారంభిస్తుంది.

చిత్రం వెనుక ఉన్న ప్రధాన తాత్విక దృక్పథం గురించి వివరిస్తూ, సమస్త జీవరాశు ల పట్ల గౌరవభావం కలిగి ఉండటం, ఇతరులు అనుభవించే బాధను అర్థం చేసుకుని సానుభూతి చూపడం ఎంతో ముఖ్యమని ఎలిఫ్ ఎడా పేర్కొన్నారు. బాధను అనుభవించడంలోనే అసలైన ప్రమాదం లేదని, ఇతరులు పడుతున్న బాధ పట్ల నిర్లిప్తంగా మారిపోవడమే నిజమైన ప్రమాదమని ఆమె అభిప్రాయపడ్డారు. భూమిపై ప్రతి జీవి ప్రాణానికి ఉన్న విలువను ప్రస్తావిస్తూ, సమస్తాన్నీ తన ఆధీనంలో ఉ ంచుకోవాలన్న మనిషి తపన ఇతర జీవరాశు లకు బాధ కలిగించే పరిస్థితులకు ఎలా దారితీస్తోందో ఆమె వివరించారు.

ఈ చిత్రం ద్వారా సాధారణంగా ఎవరికీ కనిపించని జంతువుల బాధలపై గళమెత్తాలని తాను కోరుకున్నట్లు దర్శకురాలు ఎలిఫ్ ఎడా తెలిపారు.

చిత్ర పరిశ్రమలో మహిళా దర్శకురాలిగా తనకంటూ ఒక గుర్తింపు తెచ్చుకోవడంలో ఎదురైన సవాళ్ల గురించి కూడా ఆమె మాట్లాడారు. తమ సృజనాత్మక ఆకాంక్షలను నెరవేర్చుకునే క్రమంలో మహిళలు అదనపు ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆమె పేర్కొన్నారు.

'ది ఫార్మ్' చిత్ర నిర్మాణంలో తన అనుభవాలను వంచుకుంటూ ఛాయాగ్రాహకుడు ఎమ్రే పెక్‌చాకిర్ ? ఆవులను చిత్రీకరించే సమయంలో ఎదురైన ప్రత్యేక సవాళ్ల గురించి వివరించారు. చిత్రీకరణ అనుభవాలను గుర్తుచేసుకుంటూ, ఆవుల ప్రవర్తనను, వాటి పరిసరాల్లోని సూక్ష్మమైన అంశాలను కెమెరాలో బంధించేందుకు తాను పొలాల్లోనే ఎక్కువ సమయం గడుపుతూ జంతువులకు దగ్గరగా ఉండేవాడినని తెలిపారు.

కొన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ, జంతువులతో కలిసి చిత్రీకరణ చేయడం సినిమా నిర్మాణ ప్రక్రియలో ఎంతో ఆనందాన్నిచ్చిన, కొత్త అనుభవాలను అందించిన భాగమని ఆయన పేర్కొన్నారు.

'రహ్మే', 'ది ఫార్మ్' చిత్రాలు రెండూ కరుణ, అనుబంధం, సానుభూతి వంటి విలువలను హృదయానికి హత్తుకునేలా ఆవిష్కరిస్తాయి.

మన సొంత పరిస్థితులకే పరిమితం కాకుండా, ఇతరుల జీవితాలను, వారు ఎదుర్కొంటున్న కష్టాలను కూడా అర్థం చేసుకోవాలని ప్రేక్షకులకు గుర్తుచేస్తాయి.

ఘోర రోడ్డు ప్రమాదం...

ఆగి ఉన్న ట్యాంకర్‌ను వేగంగా ఢీకొట్టిన థార్..
ప్రమాదం జరిగిన వెంటనే కారులో చెలరేగిన మంటలు..
ఇద్దరు సజీవ దహనం.. తీవ్రగాయాలతో మరో ఇద్దరు మృతి..
నుజ్జునుజ్జయిన వాహనం

విజయనగరం, నవంబర్ 24:విజయనగరం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. వేగంగా దూసుకొచ్చిన థార్ కారు రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్యాంకర్ లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. ఢీకొన్న వెంటనే కారులో మంటలు చెలరేగడంతో ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. కారు పూర్తిగా దగ్ధం కావడంతో పాటు ముందు, వెనుక భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా సుందరపేట సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వైపు ఓ థార్ కారు వెళ్తోంది. ఈ క్రమంలో సుందరపేట సమీపానికి చేరుకోగానే వేగంగా వచ్చిన కారు రోడ్డు పక్కన నిలిప

కొలనుపాక సోమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

సోమేశ్వరుడు, కోటొక్క లింగం, చండికాంబ దర్శనానికి భారీ క్యూ వేలాదిగా తరలివచ్చిన భక్తులు.. ఆలయం వద్ద పోలీసుల బందోబస్తు



నల్గొండ, నవంబర్ 24: కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చండికాంబ సమేత సోమేశ్వర స్వామి ఆలయానికి మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక పెరగడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి.

ఆలయ అర్చకులు జీఎం సోమయ్య, గంగాధర్, రాజశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు భారీ క్యూ లైన్లలో నిలబడి సోమేశ్వర స్వామి, కోటొక్క లింగం, చండికాంబ అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలేరు పోలీసులు ఆలయం వద్ద విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

'భారత అంతర్జాతీయ వాణిజ్య మేళా- 2026'లో ప్రధాన ఆకర్షణగా ఆయుష్ మండపం

న్యూ ఢిల్లీ, నవంబర్ 24:నలభై అయిదో 'భారత అంతర్జాతీయ వాణిజ్య మేళా- 2026' (ఐఐటీఎఫ్)ను ఈ నెల 13 నుంచి 27 వరకు న్యూఢిల్లీలోని భారత్ మండపం 2వ నంబరు హాలులో నిర్వహిస్తున్నారు. దీనిలో ఆయుష్ మంత్రిత్వ శాఖ భారత్‌కు చెందిన వివిధ సాంప్రదాయిక ఆరోగ్య సంరక్షణ పద్ధతులను ప్రదర్శిస్తోంది. సందర్శకులకు ఆరోగ్య సంరక్షణ సంప్రదింపులు, చర్చలు, సాంప్రదాయిక ఆహార పదార్థాల తయారీ, ఔషధీయ మొక్కల ప్రదర్శనతో పాటు విద్యాసంబంధిత ప్రజెంటేషన్ల ద్వారా ఆరోగ్యదాయక జీవనశైలిని ప్రోత్సహించడంలో, వ్యాధులు రాకుండా శరీరాన్ని కాపాడుకోవడానికి తీసుకోవలసిన జాగ్రత్త చర్యలను తెలియజేయడంలో ఆయుష్ చికిత్సా పద్ధతులకు ఉన్న సందర్భశుద్ధిని, ప్రాధాన్యాన్ని ఆయుష్ పెవిలియన్ స్పష్టం చేస్తూ, విశేష అనుభవాన్ని పంచుతున్నది.

ఆయుష్ మంత్రిత్వ శాఖలో భాగమైన వివిధ సంస్థలు, పరిశోధన మండలులు ఈ మండపంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశాయి. ఇక్కడ సాంప్రదాయిక జ్ఞానాన్ని నిత్య జీవితంలో ఆరోగ్య సంబంధిత అలవాట్లతో జోడిస్తూ, వేరువేరు కార్యకలాపాలను, సేవలను ప్రదర్శిస్తున్నారు. సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రిసర్చ్ ఇన్ ఆయుర్వేదిక సైన్సెస్- సెంట్రల్ ఆయుర్వేద రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీసీఆర్ఏఎస్-సీఏఆర్ఐ) ద్వారా ఆయుర్వేద తాలూకు అవుట్‌పేషెంట్ విభాగం (ఓపీడీ) సేవలతో పాటు 'ప్రకృతి పరీక్ష' సదుపాయాన్ని అందిస్తున్నారు. దీంతో పాటు నివారణ ప్రధాన ఆరోగ్యసంరక్షణ, ఆరోగ్యకర జీవనశైలులు, ఆయుర్వేద సంబంధిత వెల్‌నెస్ సమాచారాన్ని కూడా అందిస్తున్నారు. సాధారణంగా ఉపయోగించదగ్గ ఔషధీయ మూలికలు, మసాలా దినుసులను న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న అఖిల భారత ఆయుర్వేద సంస్థ (ఏఐఐఏ) ప్రదర్శిస్తోంది. వీటిలో అశ్వగంధ, శతావరి, అర్జున, ఉసిరి, పసుపు, గుడూచీ వంటివి ఉన్నాయి. వాటి సాంప్రదాయిక ఆయుర్వేద ఉపయోగాలతో పాటు ఆరోగ్యాన్ని పెంపొందింపచేయడంలో వీటి ప్రాసంగికతను గురించి కూడా వివరిస్తున్నారు. ఔషధీయ మూలికలను ఉపయోగిం చడా నికన్నా ముందు వాటిని ఎంత మోతాదుల్లో వాడాలి, వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితులు, వృత్తినిపుణుల సలహాలకు ఉన్న ప్రాధాన్యాన్ని గురించి కూడా సందర్శకులకు సమాచారాన్ని అందిస్తున్నారు.

జైపూర్ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు కొనసాగిస్తున్న జాతీయ ఆయుర్వేద సంస్థ (ఎన్ఐఏ) తరఫున ఆయుష్ ఆహార ఉత్పాదనలను ప్రదర్శనకు పెట్టారు. వాటిలో రాగి కుకీస్, త్రిఫల జామ్, ఎలో వెరా జెల్, హెర్బల్ లిప్‌బామ్ వంటివి ఉన్నాయి. ఇక్కడ ఆహారం, జీవనశైలి ఆధారిత ఆయర్వేదిక సర్పాలు, నిచ్చెనల ఆటతో పాటు, మానవ శరీరంలో విభిన్న వ్యవస్థలను దృశ్య రూపంలో వివరించే వర్చువల్ రియాలిటీ అనుభవం సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. వీటినికి అదనంగా ప్రకృతి, పంచకర్మ, ఆయుర్వేదిక వంటకాలు, దైనందిన జీవితంలో ఆయుర్వేద పోషించగల పాత్ర పట్ల అవగాహనను పెంపొందింప చేయడానికి సూచనలు, విద్య, కమ్యూనికేషన్ (ఈఐసీ) సామగ్రిని కూడా ప్రదర్శిస్తున్నారు.

ఆయుర్వేద ఆధారిత ఆహార నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి పోషక్ కుకీస్, ఆయుర్వేదిక్ బ్రెడ్, సాంప్రదాయిక పానీయమైన 'పానకం'ను రాష్ట్రీయ ఆయుర్వేద విద్యాపీఠ్ (ఆర్ఏవీ) వారు ప్రదర్శిస్తున్నారు. 'దాదీ సే పూఛో', 'మిలెట్స్ ఆన్ ద వీల్' వంటి కార్యకలాపాల ద్వారా సందర్శకులకు సాంప్రదాయిక అన్నపానాల అలవాట్లు, సిరిధాన్యాల పోషక సంబంధిత ప్రయో జనాలతో పాటు ఆరోగ్య జీవన శైలి పట్ల అవగాహనను పెంపొందింపచేస్తున్నారు.

మురార్జీ దేశాయి జాతీయ యోగా సంస్థ (ఎమ్‌డీఎన్ఐవై) ఆధ్వర్యంలో ఆయుష్ మండపంలో ఏర్పాటు చేసిన ఒక ప్రత్యేక వేదికపై యోగా ప్రదర్శన, యోగా కార్యక్రమాలను తరచు నిర్వహిస్తున్నారు. సందర్శకుల వయసును, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను, జీవనశైలిని పరిశీలించి వాటికి అనుగుణంగా ఉండే వ్యక్తిగత యోగా సంప్రదింపుల సేవలను కూడా సమకూరుస్తున్నారు. వీటికి తోడు, యోగాకు సంబంధించిన ప్రశ్నలు-జవాబుల పోటీలు, ఆసనాల పోటీలను నిర్వహించడం ద్వారా ప్రజలు ఆ పోటీలలో పాలుపంచుకోవడానికి ముందుకు వచ్చేటట్లు చూస్తూ వారి భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. వీటిలో సందర్శకులు చురుకుగా పాల్గొంటున్నారు. యోగాను తమ దినచర్యలో ఒక భాగంగా చేర్చుకోవడానికి పలువురు మొగ్గు చూపుతున్నారు.

యునానీ స్టాలును కేంద్రీయ యునానీ వైద్య పరిశోధన మండలి (సీసీఆర్‌యూఎమ్) ఆధీనంలో న్యూఢిల్లీ ప్రధానకేంద్రంగా పనిచేస్తున్న రీజనల్ రిసర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యునానీ మెడిసిన్ (ఆర్ఆర్ఐయూఎమ్) నడుపుతోంది. దీనిలో సాంప్రదాయిక యునానీ ఆహారాన్ని, ఆరోగ్య సంరక్షణ పద్ధతులను ప్రదర్శిస్తున్నారు. ఇక్కడ సందర్శకులకు యునానీ కహవా, హరీరా, హల్వా ఫీకావర్, గుల్‌కంద్, మురబ్బా ఆమ్లా వంటి సాంప్రదాయిక ఆహార, పానీయాలను రుచి చూసేందుకు అనుమతిస్తున్నారు. మార్పుచేర్పులు చేసిన డిజిటల్ మిజాజ్ మూల్యాంకన కియోస్కును ఉపయోగించి సందర్శకులకు తమ స్వస్థతను మదింపు చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నారు. దీంతో వారు తమ వ్యక్తిగత ఆహార సంబంధిత సూచనలను కూడా అందుకోగలుగుతున్నారు. ఈ స్టాలులో యునానీ వైద్య పద్ధతికి సంబంధించిన డిజిటల్ ప్రజెంటేషన్లు, డాక్యుమెంటరీలను కూడా ప్రదర్శిస్తున్నారు. ఈ నెల 18, 19వ తేదీల్లో యునానీ ఓపీడీ ద్వారా 151 మంది రోగులకు ఉచితంగా సంప్రదింపులతో పాటు, మందులను కూడా అందజేశారు.

ఒక స్టాలును చెన్నయి ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న కేంద్రీయ సిద్ధ పరిశోధన మండలి (సీసీఆర్ఎస్), జాతీయ సిద్ధ సంస్థ (ఎన్ఐఎస్) ఏర్పాటు చేశాయి. ఈ స్టాలులో 'సిద్ధ' వైద్య సిద్ధాంతాలను, నివారణ ప్రధానంగా ఉండే ఆరోగ్యసంరక్షణ పద్ధతులతో పాటు చికిత్సకు ఉపయోగించవలసిన విధానాలను తెలియజేస్తున్నారు. 'సిద్ధ' ఆహారం, పోషణ, జీవనశైలిలో మార్పులు, రోగ నిర్ధారణ పద్ధతులు, సాంప్రదాయిక ఔషధీయ చిట్కాలు, 'వర్మ చికిత్స' సహా చికిత్స పద్ధతులను గురించిన సమాచారాన్ని కూడా దీనిలో అందిస్తున్నారు. సందర్శకులను ఆకర్షించడానికి డిజిటల్ ప్రెజెంటేషన్లు, డాక్యుమెంటరీలు, సూచన విద్య, కమ్యూనికేషన్ (ఐఈసీ) సామగ్రిని ఉపయోగిస్తున్నారు. వీటికి అదనంగా జాతీయ సిద్ధ చికిత్స సంస్థకు చెందిన విద్యా, పరిశోధన కార్యకలాపాలను కూడా ఈ స్టాలులో వివరిస్తున్నారు. వాటిలో బీఎస్ఎమ్ఎస్, ఎమ్‌డీ (సిద్ధ), పీహెచ్‌డీ పాఠ్యక్రమాలు ఉన్నాయి. వీటి సమాచారాన్ని తెలుసుకోవడం వల్ల సిద్ధ చికిత్సను అధ్యయనం చేసే, ఈ రంగంలో ఉద్యోగ అవకాశాలను గుర్తించే ప్రక్రియలపై విద్యార్థులకు పట్టు చిక్కుతున్నది. డిజిటల్ ఆడియో, విజువల్ సామగ్రి, ఐఈసీ సామగ్రిలతో పాటు ఆయుష్ ఆహార ప్రదర్శన ద్వారా యోగా, నేచరోపతి గురించి ప్రచారాన్ని యోగ, నేచరోపతిలలో పరిశో ధనకు ఉద్దేశించిన కేంద్రీయ మండలి (సీసీ ఆర్‌వైఎన్) నిర్వహిస్తోంది. ఇందులో మఖానా లడ్డూ, వేరుసెనగ లడ్డూ, నువ్వుల లడ్డూ, ఖారా వంటి ఆరోగ్య వర్ధక అల్పాహారాన్ని సందర్శకులకు పరిచయం చేస్తున్నారు.

నవంబర్ 25న ప్రారంభం కానున్న నయీ చేతన 5.0

న్యూ ఢిల్లీ, నవంబర్ 24:మహిళలపై హింస నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న జాతీయ లింగ సమానత్వ ప్రచార కార్యక్రమం 'నయీ చేతన ? పహల్ బద్లావ్ కీ' అయిదో విడత 2026 నవంబర్ 25న ప్రారంభం కానుంది. దీన్‌దయాల్ అంత్యోదయ యోజన?జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం) పరిధిలో నెల రోజుల పాటు జరిగే ఈ ప్రచార కార్యక్రమం 2026 నవంబర్ 25 నుంచి డిసెంబర్ 23 వరకు దేశవ్యాప్తంగా అమలవుతుంది.

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి అన్నపూర్ణ దేవి సమక్షంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈ జాతీయ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి శ్రీ కమలేష్ పాశ్వాన్, ఈ ప్రచారంలో భాగస్వామ్యం పంచుకుంటున్న మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు, అభివృద్ధి భాగస్వాములు, దేశవ్యాప్తంగా ఉన్న సామాజిక సంస్థల మహిళా నాయకులు కూడా హాజరవుతారు.

నయీ చేతన 5.0 ఇతివృత్తం "అవకాశం నుంచి స్వీయ నిర్ణయాధికారం వరకు: వికసిత భారత్ కోసం జీవనోపాధి, సమాన అవకాశాల ద్వారా మహిళా సాధికారత". ఇది ఆర్థిక సాధికారత, జీవనోపాధిలో భాగస్వామ్యం, స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడంలో అవకాశాలు, రవాణా సౌకర్యాలు మహిళలకు అందుబాటులో ఉండాల్సిన అవసరాన్ని తెలియజేస్తుంది.

నయీ చేతన 5.0 విధానంలో ప్రధానాంశంగా మహిళల ఆర్థిక సాధికారత ఉంది. ఈ విధానం పరస్పరం అనుసంధానమై ఉన్న నాలుగు రంగాలపై దృష్టి సారిస్తుంది. అవి... మహిళలను ఆర్థిక భాగస్వాములుగా గుర్తించడం, ఆస్తులపై మహిళల హక్కులు ? వాటిపై వారికున్న నియంత్రణను బలోపేతం చేయడం, సురక్షితమైన రవాణా సౌకర్యాలను ప్రోత్సహించడం, వేతనం లేని సంరక్షణ పనిని పునఃపంపిణీ చేయడం. జీవనోపాధి అవకాశాలను, మార్కెట్లను, ఆర్థిక సేవలను, బహిరంగ ప్రదేశాలను, అత్యవసరమైన సేవలను పొందడంతో పాటు స్వేచ్ఛగా, సురక్షితంగా, స్వతంత్రంగా ప్రయాణించడంలో మహిళలకు ఎదురవుతున్న అవరోధాలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తుంది. అవగాహనను కల్పించడంతో పాటుగా మహిళల ఆర్థిక భాగస్వామ్యం, ఏజెన్సీ, నిర్ణయాధికారంలో సమన్వయ చర్యలు చేపట్టి, కొలవదగిన మెరుగుదలలు సాధించడమే ఈ ప్రచారం లక్ష్యం.

15 మంత్రిత్వ శాఖలు/విభాగాలు భాగస్వామ్యం పంచుకొనే సంయుక్త అంతర-మంత్రిత్వ శాఖల అడ్వయిజరీని విడుదల చేయడం ఈ జాతీయ ప్రచారం ప్రారంభ కార్యక్రమంలో ప్రధానమైనది. సమన్వయ చర్య, ఏకీకరణ ద్వారా నయీ చేతన 5.0 లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లాలనే ఉమ్మడి నిబద్ధతను ఈ అడ్వయిజరీ ప్రతిబింబిస్తుంది. ఈ ప్రచారం లక్ష్యాలతో తమ పథకాలను, కార్యక్రమాలను, సంస్థాగత యంత్రాంగాలను, క్షేత్రస్థాయి వ్యవస్థలను సమన్వయం చేసుకొనేందుకు అవసరమైన విధివిధానాలు మంత్రిత్వశాఖలు, విభాగాలకు ఈ అడ్వయిజరీ అందిస్తుంది. అలాగే జాతీయ, రాష్ట్ర, జిల్లా, కమ్యూనిటీ స్థాయుల్లో సమన్వయ చర్యలను బలోపేతం చేయడానికి ప్రయత్నిస్తుంది. ముఖ్యంగా మహిళలకు జీవనోపాధి, ఆస్తులు, ఆర్థిక సేవలు, సురక్షిత రవాణా, అవసరమైన సేవలు, సంస్థాగత సహకారాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తుంది. ఈ కార్యక్రమంలో, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ, మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ శాఖ, జాతీయ న్యాయ సేవల అథారిటీ (ఎన్ఏఎల్ఎస్ఏ)ల మధ్య హింసారహిత గ్రామ కార్యక్రమంపై కుదిరిన నాలుగు పక్షాల అవగాహన ఒప్పందాన్ని కూడా విడుదల చేస్తారు. సమాజంలో లింగ ఆధారిత హింసను నివారించే, స్పందించే సమన్వయ సంస్థాగత చర్యలకు అవసరమైన విధివిధానాలను ఈ ఎంవోయూ అందిస్తుంది. చట్టపరమైన హక్కులపై అవగాహన, న్యాయం పొందే అవకాశం, సంస్థాగత మద్దతు, హింస లేని గ్రామాలను నిర్మించే దిశగా సామూహిక చర్యలతో సహా, సామాజిక సంస్థలు, న్యాయ సేవల అధికారులు, సంబంధిత ప్రభుత్వ యంత్రాంగాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడమే దీని ఉద్దేశం.

స్వయం సహాయక బృందాలు (ఎస్‌హెచ్‌జీలు), గ్రామ సంస్థలు (వీవోలు), క్లస్టర్ స్థాయి సమాఖ్యలు (సీఎల్ఎఫ్‌లు), జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీలు), ఇతర సామాజిక సంస్థలతో కూడిన డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం విస్తృత వ్యవస్థ... నయీ చేతన 5.0 అమల్లో కీలక పాత్ర పోషిస్తుంది. ఈ ప్రారంభోత్సవంలో సేవలు, హక్కులు, సహాయక వ్యవస్థలు, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాలను సులభంగా పొందేందుకు వీలుగా కమ్యూనిటీ స్థాయి వేదికలుగా నూతన జెండర్ రిసోర్స్ కేంద్రాలను కూడా ప్రారంభిస్తారు. మహిళల సమష్టి చర్యలను, నాయకత్వాన్ని బలోపేతం చేయడంపై తమ అనుభవాలను, ఆవిష్కరణలను వివిధ రాష్ట్రాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ మహిళా నాయకులు పంచుకుంటారు.

ఈ కార్యక్రమంలో భాగంగా రెండు ప్యానెల్ చర్చలను నిర్వహిస్తారు. "జెండర్ రిసోర్స్ సెంటర్లు (జీఆర్‌సీలు), వన్ స్టాప్ సెంటర్లు (ఓఎస్‌సీలు), లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఎల్ఎస్ఏ), ఆరోగ్య వ్యవస్థ ద్వారా మంత్రిత్వ శాఖల సమన్వయాన్ని ముందుకు తీసుకెళ్లడం" అనే అంశంపై మొదటి ప్యానెల్ చర్చ జరుగుతుంది. దీనిలో సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. దీనిలో మహిళల సమస్యలపై సమన్వయాన్ని, ఉమ్మడి కార్యాచరణను బలోపేతం చేయడంపై చర్చిస్తారు. "క్షేత్రస్థాయి మహిళా నాయకులు: అనుభవాలు, ఆవిష్కరణలు, ముందున్న మార్గం" అనే అంశంపై రెండో ప్యానెల్ చర్చ నిర్వహిస్తారు. ఇది తమ అనుభవాలను, సిఫారసులను పంచుకొనే వేదికను క్షేత్రస్థాయి మహిళా నాయకులకు అందిస్తుంది.

జాతీయ ప్రారంభోత్సవం సందర్భంగా నయీ చేతన 4.0 మదింపు నివేదికను విడుదల చేయనున్నారు. మునుపటి విడతలో ఈ కార్యక్రమ పనితీరు మదింపును, అందులో నేర్చుకున్న ముఖ్యమైన అంశాలను ఈ నివేదిక వివరిస్తుంది. భవిష్యత్ ప్రచార కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా రూపొందించడానికి, బలోపేతం చేయడానికి ఈ అంశాలు ఉపయోగపడతాయి.

ఈ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర స్థాయి వీడియోల ప్రదర్శన, ఉత్తమ విధానాలపై ప్రజెంటేషన్లు కూడా ఉంటాయి. లింగ సమానత్వం దిశగా సామాజిక భాగస్వామ్యంతో చేపడుతున్న కార్యక్రమాలు, అనుసరిస్తున్న విధానాలను ఇవి తెలియజేస్తాయి. ప్రచారం కోసం ప్రత్యేకంగా రూపొందించిన వీడియోలను కూడా ఈ సందర్భంగా విడుదల చేస్తారు.

నయీ చేతన కార్యక్రమాన్ని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ పరిధిలోని డీఏవై-ఎన్ఆర్ఎల్ఎం 2022లో ప్రారంభించింది. ఈ కార్యక్రమం మొదలైన నాటి నుంచి లింగ ఆధారిత హింస (జీబీవీ)ను పరిష్కరించే, వివక్షాపూరితమైన సామాజిక కట్టుబాట్లను సవాలు చేసే, లింగ సమానత్వాన్ని ప్రోత్సహించే జాతీయ స్థాయి సామాజిక ఉద్యమంగా రూపుదిద్దుకుంది. నయీ చేతన 5.0 ద్వారా మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, సామాజిక సంస్థలు, ఇతర భాగస్వాముల మధ్య సమన్వయ కార్యాచరణను బలోపేతం చేయడమే మంత్రిత్వశాఖ లక్ష్యం. దీని ద్వారా మహిళల ఆర్థిక భాగస్వామ్యం, భద్రత, స్వీయ నిర్ణయాధికారానికి అనుకూల వాతావరణాన్ని కల్పించేందుకు మంత్రిత్వ శాఖ కృషి చేస్తోంది. వివక్షాపూరిత సామాజిక కట్టుబాట్లను తొలగించి, సమానత్వాన్ని, ఉమ్మడి బాధ్యతను ప్రోత్సహించడంలో పురుషులు, బాలురు, యువత క్రియాశీలకంగా పాల్గొనేలా కూడా ఈ ప్రచార కార్యక్రమం ప్రోత్సహిస్తుంది.

బొగ్గు-లిగ్నైట్ గనుల మైనింగ్ ప్రణాళిక.. గని మూసివేత ప్రణాళిక తయారీపై బొగ్గు మంత్రిత్వశాఖ మార్గదర్శకాలు-2026 జారీ

న్యూఢిల్లీ, నవంబర్ 24:బొగ్గు-లిగ్నైట్ గనుల కోసం మైనింగ్ ప్రణాళిక, గని మూసివేత ప్రణాళిక తయారీకి మార్గదర్శకాలు-2026"ను బొగ్గు మంత్రిత్వశాఖ జారీ చేసింది. ఈ నెల 20వ తేదీన జారీ చేసిన ఈ మార్గదర్శకాలు 30 రోజుల్లోగా అమలులోకి వస్తాయి. క్రమబద్ధ, శాస్త్రీయ గని ప్రణాళికలు, మూసివేత దిశగా ఫలితాధారిత చట్రానికి ఇవి తోడ్పడతాయి. ఇప్పటికే గల చట్టబద్ధ చట్రానికి ఇది అనుబ ంధంగా ఉంటూ, ఇతర చట్టబద్ధ నిబంధనల పరిధిలోకి వచ్చే వాటి పునరావృతిని నివారి స్తుంది. తాజా మార్గదర్శకాల ప్రకారం- పరిశీలన, ఆమోదం సంబంధిత వివిధ ద శలలో నిర్దిష్ట కాలపరిమితిని అను సరిం చాలి. తద్వారా నిర్దిష్ట వ్యవధి ఆధారిత నిర్ణయ ప్రక్రియకు భరోసా ఉంటుంది. గనుల మూసివేత కోసం ఎస్క్రో ఖాతా నుంచి వాపసు చేసే వ్యవధిని క్లెయిమ్ తేదీ నుంచి ఒక నెలకు తగ్గించారు. దీంతోపాటు క్లెయిమ్‌ల ప్రయో గాత్మక తనిఖీకి కూడా వీలు కల్పించారు. అంతేకాకుండా ఎస్క్రో ఖాతా నుంచి నగదు ఉపసంహరణపై ఐదేళ్ల క్లెయిమ్‌ల ధ్రువీకరణ దిశగా ఏజెన్సీల పరిధిని కూడా విస్తరిం చారు. నానాటికీ పురోగమిస్తున్న సాంకేతిక తలకు అనుగుణంగా భూగర్భ బొగ్గు గ్యాసిఫికే షన్‌ను ఒక మైనింగ్ పద్ధతిగా ఈ మార్గద ర్శకాలు గుర్తిస్తాయి. "భూగర్భ గ్యాసిఫికేష న్-2026 దిశగా బొగ్గు-లిగ్నైట్ బ్లాక్‌లు/గనుల మైనింగ్ ప్రణాళిక తయారీ-ఆమోదంపై మార్గదర్శకాలు'' కూడా ఇందులో అంతర్భాగం అయ్యాయి.

ఎఱకేశ్వర స్వామి ఆలయంలో సర్వోత్తమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు

కార్తీక పౌర్ణమి సందర్భంగా పిల్లలమర్రిలో స్వామివారి దర్శనం వెంట పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు



నల్గొండ, నవంబర్ 24:కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పిల్లలమర్రిలోని శ్రీ ఎఱకేశ్వర స్వామి దేవాలయంలో నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

ఆయన వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ కౌన్సిలర్లు కోడి నాగరాజు, కొండపల్లి దిలీప్‌రెడ్డి, గుణగంటి హేమ సతీష్, ఎల్లురి ఇందిరా వీరయ్య, చివ్వేంల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారవత్ వీరన్న నాయక్, మాజీ కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ రావర్తి శ్రీనివాస్, శ్రీ దండు మైసమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ తంగేళ్ల కరుణాకర్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

చండీగఢ్ నగర రూపకల్పనలో మాసీయెజ్ నొవికీ కీలక పాత్ర.. ఇఫీ 2026లో ఆ అరుదైన చరిత్రను ఆవిష్కరించిన 'నిర్మాంజలి'

న్యూఢిల్లీ, నవంబర్ 24:గోవా, 23 నవంబర్ 2026: గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) సందర్భంగా నేడు పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) నిర్వహించిన విలేకరుల సమావేశంలో జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ చిత్ర దర్శకుడు సూరజ్ కుమార్ ఒక అరుదైన చారిత్రక వారసత్వాన్ని వెలుగులోకి తెచ్చారు. 'నిర్మాంజలి: ది చండీగఢ్ ఆఫ్ మాసీజ్ నోవికీ' అనే తన నాన్ - ఫీచర్ డాక్యుమెంటరీ ద్వారా వాస్తుశిల్పి మాసీజ్ నోవికీ చండీగఢ్ నగర నిర్మాణానికి అందించిన విశేష కృషిని ఆయన పరిచయం చేశారు.

పటిష్టమైన, భారీ కట్టడాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వడానికి బదులుగా, భారత వాతావరణ పరిస్థితులు, సామాజిక జీవనశైలికి అనుగుణంగా నోవికీ తన డిజైన్లను రూపొందించారు. కృత్రిమ జలాశయాన్ని నిర్మించాలన్న ఆయన ఆలోచనే తరువాత సుఖ్నా సరస్సుగా రూపుదిద్దుకుంది. పాఠశాలలు, ఉద్యానవనాలు, మార్కెట్లు, సామాజిక కార్యకలాపాలకు అవసరమైన ప్రదేశాలతో కూడిన స్వయం సమృద్ధి నివాస సముదాయాలైన 'సూపర్‌బ్లాక్'లను కూడా ఆయన ప్రతిపాదించారు. అయితే, తన ఆలోచనలను అమలు చేసేందుకు 1950లో తిరిగి భారత్‌కు రావడానికి సిద్ధమవుతున్న తరుణంలో నోవికీ విమాన ప్రమాదంలో మరణించారు. ఆయన రూపొందించిన చిత్రపటాలు, డిజైన్ల ద్వారా ఆ ఆలోచనలు సజీవంగా నిలిచాయి. వాటిని గుర్తించిన స్విస్ వాస్తుశిల్పి పియెర్ జెన్నరెట్ చండీగఢ్‌లోని 7, 8వ సెక్టార్ల అభివృద్ధిలో వాటిని పొందుపరిచారు.

అంతగా వెలుగులోకి రాని ఈ చరిత్రను పునర్నిర్మించేందుకు భారత్‌తో పాటు విదేశాల్లోనూ విస్తృతమైన ఆర్కైవ్ పరిశోధన చేయాల్సి వచ్చిందని సూరజ్ కుమార్ తెలిపారు. చండీగఢ్ ఆర్కిటెక్చర్ మ్యూజియంలో నోవికీకి సంబంధించిన 20 నుంచి 25 వరకు మాత్రమే నమూనాలు, డిజైన్లు భద్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. 'ది ట్రిబ్యూన్' పాత సంచికలను పరిశీలించడంతో పాటు, నోవికీ ఆర్కిటెక్చర్ విభాగాధిపతిగా పనిచేసిన నార్త్ కరోలినా స్టేట్ యూనివర్సిటీలో డిజిటల్ రూపంలో భద్రపరిచిన రూపకల్పన నోట్స్‌ను కూడా అన్వేషించినట్లు తెలిపారు. పోలాండ్ రాయబారి సూచన మేరకు చేపట్టిన ఈ పరిశోధనకు పోలాండ్ రాయబార కార్యాలయం, పోలిష్ ఇన్‌స్టిట్యూట్ సహకారం అందించాయి. 75 ఏళ్ల క్రితం నోవికీ రూపొందించిన నగర నిర్మాణ ప్రణాళికలు నేడు అధిక ఉష్ణోగ్రతలు, పట్టణాల విస్తరణ వంటి సమస్యలను ఎదుర్కొంటున్న భారతీయ నగరాలకు విలువైన పాఠాలను అందిస్తాయని శ్రీ కుమార్ పేర్కొన్నారు. ఆధునిక వాస్తుశిల్పం స్థానిక వాతావరణ పరిస్థితులకు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

సూరజ్ కుమార్, డాక్టర్ గరిమా సింగ్ నేతృత్వంలోని జాన్సన్స్ సూరజ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ (జేఎస్ఎఫ్ఐ) సంస్థ ఈ డాక్యుమెంటరీ చిత్రాన్ని నిర్మించింది. 'నిర్మాంజలి' చిత్రానికి ముర్తజా అలీ ఖాన్ స్క్రీన్‌ప్లే అందించగా రాకేశ్ రాణా ఛాయాగ్రహణం, అమిత్ రాయ్ ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహించారు. శుభేంద్రరావు, సాస్కియా రావు - డి హాస్ సంగీతం సమకూర్చారు. ప్రముఖ సీనియర్ నటుడు విక్టర్ బెనర్జీ కూడా ఈ చిత్రంలో నటించారు. భారతీయ మాస్ కమ్యూనికేషన్ సంస్థ (ఐఐఎంసీ) పూర్వ విద్యార్థి సూరజ్ కుమార్‌కు డాక్యుమెంటరీలు, ఫీచర్ చిత్రాల నిర్మాణంలో 27 ఏళ్ల అనుభవం ఉంది.



జంతు సంరక్షణ సామాజిక బాధ్యత

నవంబర్ 25... జాతీయ జంతు సంక్షేమ దినం సందర్భంగా



భూమి మీద మనుషులతో పాటు ఎన్నో రకాల జంతువులూ ఉన్నాయి. వాస్తవానికి మనిషి కంటే ముందే జంతువులు భూమి మీద జీవించాయని సైన్స్ చెబుతోంది. జీవం నుండి జీవం రావడం మాత్రమే కాదు. ఒక జీవ జాతి అదే జీవ జాతి నుండి మాత్రమే ఉత్పన్నం అవుతుంది. కుక్కలకి కుక్క పిల్లలే పుడతాయి. పిల్లలకు పిల్లి కూనలే పుడతాయి.

అలా పెంపుడు కుక్కల జాతి ప్రపంచంలోనే పురాతనమైన జాతిగా, క్రీ.పూ 329 నాటిదని, జాతి సంవత్సరాల నాటిదని,

పెంపుడు పిల్లుల జాతి, 9,500 సంవత్సరాల నాటిదని రుజువు పరచడం సామాన్యమైన విషయమేమీ కాదు...ప్రస్తుతం భూమి వయసు 4.6 బిలియన్ల (4,600,000,000) సంవత్సరాలు ఉంటుందని శాస్త్రవేత్తల అంచనా. భూమి మీద జీవావిర్భావం 350 కోట్ల ఏళ్ల క్రితం జరిగిందని ప్రస్తుతం శాస్త్రవేత్తలు నమ్ముతున్నారు. అత్యంత పురాతనమైన శిలాజాలు 60 కోట్ల ఏళ్ల నాటివని, కాని అత్యంత పురాతనమైన శిలాజాల వయసు కన్నా భూమి వయసు ఏడు రెట్లు పైగా ఉంటుంద ని పరిశోధనలు తేల్చి చెపుతున్నాయి. కోట్ల సంవత్సరాల క్రితం జీవించిన బృహత్తర జీవాలకి చెందిన శిలాజాలు కూడా ఉన్నాయి. అవి సరీసృపాలు (నేల మీద పాకే జంతువులు). మనకు తెలిసిన మొసళ్ళు, బల్లులు మొదలైనవి ఈ కోవకి చెందినవే. కాని అంతకన్నా పెద్దవి, అంతకన్నా పెద్దవైన అతి ప్రాచీన యుగాలలో జీవించిన బృహత్తర సరీసృపాలే నేడు మనం అంతగా చెప్పుకునే డైనోసారస్‌లు.

అయితే భూమి ఆవిర్భవించిన తరవాత పుట్టిన చాలా జంతు జాతులు క్రమేపీ కనుమరుగు అవుతున్నాయి. చాలా జాతులు ఇప్పుడు లేవు. ఆధునిక యుగంలోనూ మనకు తెలిసిన ఎన్నో జంతు జాతులు చూస్తుండగానే భూమికి దూరం అవుతున్నాయి. ఇలా జంతువుల జాతులు అంతరించి పోకుండా, వాటిని పరిరక్షించడమే 'ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం' ముఖ్యోద్దేశం. జంతు సంక్షేమం కోసం విశేషంగా కృషి చేసిన సాధు టి.ఎల్.వాస్వాని జయంతిని పురస్కరించుకొని వివిధ జంతు సంక్షేమ సంస్థలు ప్రతి సంవత్సరం నవంబర్ 25న జంతు సంక్షేమ దినం జరుపు కుంటాయి.

వాస్తవానికి మనం జంతువుల ఆవాసాలను నాశనం చేస్తున్నాం. విచక్షణారహితంగా అడవులు నరుకుతూ వాటి తావులను, మంచినీటి వనరులను ధ్వంసం చేస్తున్నాం. అందుకే అడవి జంతువులు గ్రామాల్లోకీ, పట్టణాల్లోకి వస్తున్నాయి. ఆహారం కోసం మనుషులపై దాడులు కూడా చేస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిని మార్చడం కూడా ఈ జంతు సంక్షేమ దినోత్సవం లక్ష్యాల్లో ఒకటి. జంతువులకు సహజసిద్ధమైన ఆవాసాలను కల్పించడం, జంతు జాతులను రక్షించడం, వాటి సంక్షేమాన్ని కాపాడటం ప్రధానం.

అటవీ ప్రాంతాలను అన్యాక్రాంతం చేస్తుండడంతో స్వేచ్ఛగా తిరుగాడే జంతు జాలానికి రక్షణ కరువైంది. శతాబ్దాల నుంచి మనుషుల దాడులు, వేటల నుంచి తప్పించుకుంటూ అడవులలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని జీవించిన జంతు జాలానికి నేడు తమ ఉనికిని కాపాడు కోవడమే కష్టమవుతున్నది. మాంసం కోసం, వినోదం కోసం మానవులు అనేక రకాలుగా జంతువుల ప్రాణాలు తీస్తున్నారు. తమ వృత్తులకు, అవసరాలకు జంతువులను ఉపయోగించుకుంటూ వాటిని హింసిస్తున్నారు. ఆవు, మేక, గేదె మొదలైన జంతువులు ఎక్కువ పాలు ఇవ్వడం కోసం రసాయనాల ఇంజెక్షన్లు ఇస్తూ వాటిని హింసించడం సర్వ సాధారణం అయిపోయింది.

వాస్తవంగా ఇందుకు సంబంధించి, పార్లమెంటులో చట్టం రూపొందింది. ఈ చట్టం ప్రకారం జంతువులను ఉద్దేశ పూర్వకంగా గానీ, నిర్లక్ష్యంగా గానీ బంధించినా, ఇబ్బంది కలిగించినా శిక్షార్హులు అవుతారు. 1960 డిసెంబర్ 26 నుంచి ఈ చట్టం అమలులో ఉంది. భారత ప్రభుత్వం 1972లో వన్య ప్రాణుల సంరక్షణ చట్టాన్ని రూపొందించింది.

వన్యప్రాణుల అక్రమ విక్రయాలు, వీధి జంతువులపట్ల నిర్లక్ష్యం, కిరాతంగా, క్షేత్ర జంతువుల పట్ల అమానుష ప్రవర్తన వంటివన్నీ భారత చట్టాల ప్రకారం శిక్షార్హం.

భారత పార్లమెంటు రూపొందించిన జంతువులపట్ల క్రూరత్వం నివారణ చట్టం సెక్షన్ 11 (1) నుండి (ఓ), ప్రకారం జంతువులను వేటాడటం, స్వాధీనం లేదా పట్టుకోవడం, ఏ జంతువునైనా అవయవమును తొలగించడం లేదా చంపడంవంటి అనేక ఇతర క్రూర చర్యలకు బాధ్యులైన వారిని చట్టం ద్వారా శిక్షిస్తారు. జంతు రవాణాలో అనవసర హింసకు పాల్పడే వారికి, జంతువులను కిక్కిరిసినట్టుగా వాహనాల్లో నింపేవారికి, జంతువుల కాళ్ళు కట్టేసి వాహనాలపై తీసుకువెళ్ళే వారికి రూ 100 లేదా మూడు నెలల కారాగార శిక్ష లేదా రెండు శిక్షలూ కలిపి విధించవచ్చు. భారత శిక్షా స్మృతి సెక్షను 428 మరియు 429 కింద జంతువులను భయపెట్టడం గాయ పరచడం చట్టవిరుద్ధం. జంతువులను లేదా జంతు సంరక్షకులను భయ కంపితులను చేయడాన్ని 1860 భారత శిక్షాస్మృతి సెక్షన్ 503 ప్రకారం తెలిసి లేదా స్పృహతో చేస్తున్న నేరంగా పరిగణిస్తారు. ఇటువంటి వారిని ఎటువంటి వారంటు లేకుండా అదుపులోకి తీసుకోవచ్చు.

జంతువులపట్ల జాలి, పరితాపములను చూపాలని భారత రాజ్యాంగం 51 ఎ అధికరణం పౌరుల ప్రాథమిక బాధ్యతలను నిర్వచిస్తున్నది.

భారత రాజ్యాంగపు 21వ అధికరణం వ్యక్తిగత స్వేచ్ఛ, జీవన హక్కులను ధృవపరుస్తున్నది. భారత పౌరులకు జంతువులను పెంచి పోషించే హక్కును ఈ అధికరణం ధృవపరుస్తున్నది. జంతు సంక్షేమ దినోత్సవం రోజున జంతు సంక్షేమ ప్రచారంతోపాటుగా జంతు పరిరక్షక శిబిరాలను నిర్వహించడం, జంతు సంరక్షణకు నిధులు సేకరించడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు.

జంతుసంపదను పరిరక్షించడం, వాటిని వృద్ధి చేయడంతోపాటు జంతువుల హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మానవ మనుగడకు అనివార్యమైన జంతు సంపదను పరిరక్షించడం, వృద్ధిచేయడం, జంతువులకూ సరియైన గౌరవాన్ని అందజేయడం అందరి బాధ్యత. జంతువులపట్ల మరింత మానవీయంగా ప్రవర్తించడం, ఈ స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయడం అవసరం, అనివార్యం...



-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494

కరీంనగర్ దీక్ష దివాస్‌కు సన్నద్ధం..

శాత్రాజుపల్లిలో బీఆర్ఎస్ నేతల సమావేశం



కరీంనగర్, నవంబర్ 24: (నేటినిజం ప్రతినిధి) :నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న దీక్ష దివాస్ కార్యక్రమానికి సంబంధించి శాత్రాజుపల్లిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సమావేశమ య్యారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించి, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు గుడిసె సదానందం, రేగుల రాజేశం, నల్ల సతీష్‌రెడ్డి, గుడిసె అనిల్‌కుమార్, వికృతి సాయికుమార్, పురుషోత్తం, మనోజ్‌కుమార్, బాలయ్య, కొమురయ్య, రామచంద్రంతో పాటు వలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈ నెల 25 నుంచి అగ్రిగోల్డ్ బాండ్ల ధృవీకరణ

జగిత్యాల బాధితులకు కరీంనగర్‌లో ప్రత్యేక కేంద్రం ఏర్పాటు

మండలాల వారీగా షెడ్యూల్ విడుదల చేసిన ఎస్పీ అశోక్ కుమార్

కరీంనగర్, నవంబర్ 24:వేలాది మంది అగ్రిగోల్డ్ డిపాజిటర్లకు ఊరటనిస్తూ అసలు అగ్రిగోల్డ్ బాండ్లు, నగదు రసీదుల ధృవీకరణ, నమోదు ప్రక్రియను నవంబర్ 25, 2026 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు తెలంగాణ నేర పరిశోధన విభాగం (సీఐడీ) తెలిపింది. ఇందులో భాగంగా జగిత్యాల జిల్లాకు చెందిన బాధితుల కోసం కరీంనగర్‌లో ఈ ప్రక్రియ నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ బాధితులకు త్వరితగతిన న్యాయం, ఉపశమనం కల్పించాలనే లక్ష్యంతో సీఐడీ ఆధ్వర్యంలో నిర్దేశిత కేంద్రాల్లో పని దినాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధృవీకరణ చేపడతారని పేర్కొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల బాధితుల కోసం కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని అల్మాపురి కాలనీ, కరీంనగర్?సిరిసిల్ల బైపాస్ రోడ్డులో డీర్ పార్క్ వక్కన, ఎన్టీఆర్ విగ్రహం సమీపంలోని సిటీ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (సీటీసీ)లో ప్రత్యేక ధృవీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. నవంబర్ 25, 2026 నుంచి ఫిబ్రవరి 2, 2027 వరకు మండలాల వారీ షెడ్యూల్ ప్రకారం ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి పని దినం గరిష్ఠంగా 250 ఖాతాలను పరిశీలిస్తారని తెలిపారు.

జగిత్యాల జిల్లా మండలాల వారీ షెడ్యూల్

నవంబర్ 25న బీర్పూర్ (246), 26న ధర్మపురి (250), 27న ధర్మపురి (13), ఎండపల్లి (237), 28న ఎండపల్లి (14), గొల్లపల్లి (236), 30న గొల్లపల్లి (14), ఇబ్రహీంపట్నం (236) మండలాల ఖాతాలను పరిశీలిస్తారు. డిసెంబర్ 1న ఇబ్రహీంపట్నం (12), కథలాపూర్ (238), 2న కథలాపూర్ (11), కోరుట్ల (239), 3న కోరుట్ల (8), మల్యాల (242), 4న మల్యాల (32), మల్లాపూర్ (218), 5న మల్లాపూర్ (73), మేడిపల్లి (177), 7న మేడిపల్లి (75), మెట్‌పల్లి (175), 8న మెట్‌పల్లి (97), పెగడపల్లి (153), 9న పెగడపల్లి (126), సారంగాపూర్ (124), 10న సారంగాపూర్ (122), వెల్గటూర్ (128), 11న వెల్గటూర్ (142) ఖాతాలను పరిశీలిస్తారు. డిపాజిటర్లు తమ మండలానికి కేటాయించిన తేదీని కేంద్రం వద్ద ముందుగా నిర్ధారించుకుని, సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందిస్తే వారిని కరీంనగర్‌లోని సీటీసీ కేంద్రానికి పోలీసు శాఖ తరలిస్తుందని ఎస్పీ తెలిపారు.

ధృవీకరణకు తీసుకురావాల్సిన పత్రాలు

ధృవీకరణకు వచ్చే వారు అసలు బాండ్లు, రసీదులను కేవలం పరిశీలన కోసమే చూపించాలని, వాటిని అధికారులకు సమర్పించాల్సిన అవసరం లేదని ఎస్పీ స్పష్టం చేశారు.

డిపాజిటర్ జీవించి ఉంటే: అసలు బాండ్ లేదా రసీదుతో పాటు స్వీయ ధ్రువీకరణ చేసిన రంగుల జిరాక్స్, ఆధార్, పాన్ కార్డు జిరాక్స్, పేరు, ఖాతా నంబర్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ స్పష్టంగా కనిపించే బ్యాంకు పాస్‌బుక్ మొదటి పేజీ జిరాక్స్, తాజా పాస్‌పోర్ట్ సైజు ఫొటో, మొబైల్ నంబర్, బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్ సమర్పించాలి. ఏజెంట్ వివరాలు తెలిస్తే వాటిని కూడా అందించాలి.

డిపాజిటర్ మరణించి, నామినీ జీవించి ఉంటే: నామినీ సంతకం చేసిన బాండ్ రంగుల జిరాక్స్, డిపాజిటర్ మరణ ధ్రువీకరణ పత్రం, నామినీ ఆధార్, పాన్, రేషన్ కార్డు లేదా కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, నామినీ బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, బ్యాంకు ఖాతాకు అనుసంధానమైన మొబైల్ నంబర్ తీసుకురావాలి.

డిపాజిటర్, నామినీ ఇద్దరూ మరణించి ఉంటే: చట్టబద్ధ వారసుడు సంతకం చేసిన రంగుల జిరాక్స్, ఇద్దరి మరణ ధ్రువీకరణ పత్రాల అసలు, జిరాక్స్ ప్రతులు, వారసుడి ఆధార్, పాన్, చట్టబద్ధ వారసుల లేదా కుటుంబ ధ్రువీకరణ పత్రం అసలు, జిరాక్స్ ప్రతులు, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, మొబైల్ నంబర్ సమర్పించాలి.

డిపాజిటర్ జీవించి ఉండి స్వయంగా రాలేని పరిస్థితుల్లో: కుటుంబ సభ్యులు డిపాజిటర్ అసలు బాండ్, సంతకం చేసిన రంగుల జిరాక్స్, డిపాజిటర్ ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్, ఫొటోతో పాటు ఆయన నుంచి పొందిన అధికార పత్రం (ఆథరైజేషన్ లెటర్) తీసుకురావాలి. హాజరయ్యే కుటుంబ సభ్యుడి గుర్తింపు పత్రం, కుటుంబ సంబంధాన్ని నిరూపించే పత్రం కూడా సమర్పించాలి.

ఏజెంట్ల ద్వారా పత్రాలు సమర్పించే వారు ప్రతి అసలు బాండ్, రంగుల జిరాక్స్ చూపించి, ప్రతి బాండ్ గుర్తింపు సంఖ్యను విడివిడిగా నమోదు చేయాలి. ఏజెంట్లు తమ ఆధార్, పాన్, బ్యాంకు పాస్‌బుక్ జిరాక్స్, ఫొటో, మొబైల్ నంబర్‌తో పాటు తప్పనిసరిగా ఏజెంట్ కోడ్ సమర్పించాలని సూచించారు. పత్రాల పరిశీలన అనంతరం అధికారులు రసీదు (అక్నాలెడ్జ్‌మెంట్) అందజేస్తారని తెలిపారు. ఏజెంట్ వివరాలు తెలియకపోతే దరఖాస్తు ఫారంలో 'తెలియదు', 'అందుబాటులో లేదు' అని పేర్కొనవచ్చని ఎస్పీ వివరించారు.

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధుల నియామకం



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీజేపీ సంస్థాగత నియామకాలు చేపట్టింది. తెలంగాణ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి జిల్లా అధికార ప్రతినిధులను నియమించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టనున్న ప్రతినిధులు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించాలని, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని గోపి ఆకాంక్షించారు. నూతనంగా నియమితులైన వారికి శుభాకాంక్షలు తెలిపారు.

వేములవాడ బీజేపీ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌కు జాతీయ అధ్యక్షుడి ప్రశంస

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణ బీజేపీ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్‌కు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ ప్రశంసా పత్రం పంపించారు. పట్టణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం, కార్యకర్తలతో సమన్వయం, సంస్థాగత కార్యక్రమాల్లో నాయకత్వం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రాపెల్లి శ్రీధర్ మాట్లాడుతూ పట్టణ అధ్యక్షుడిగా తాను చేస్తున్న సేవలను గుర్తించి ప్రశంసా పత్రం పంపించిన జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఈ బాధ్యత, గుర్తింపు లభించడంలో కృషి చేసిన వేములవాడ బీజేపీ నాయకులు, ప్రతి కార్యకర్తకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ..వ్యాన్ సీజ్



రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం వెంకయ్యకుంట?బాధనకల్ గ్రామాల శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద స్థలాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును, రహదారి పరిస్థితులను, ఇతర సాంకేతిక అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన వ్యాన్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేపట్టి నివేదిక సమర్పించాలని డీఎస్పీ, సీఐ, ఎస్ఐలను ఆదేశించారు. అధిక వేగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదాలకు ప్రధాన కారణాలని, పొగమంచు నేపథ్యంలో వాహనదారులు వేగం తగ్గించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత దూరం పాటించాలని సూచించారు. ఈ పరిశీలనలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ జ్యోతి పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ

సర్పంచ్ ముత్తినేని యాకలక్ష్మి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



మహబూబాబాద్, నవంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం గంట్లకుంట గ్రామంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు మంగళవారం గ్రామ సర్పంచ్ ముత్తినేని యాకలక్ష్మి సోమన్న ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అయ్యప్ప మాలధారణ స్వాములకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు భక్తి సంకీర్తనలు ఆలపిస్తూ స్వామివారి నామస్మరణ చేశారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేయడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం అందించడం ద్వారా భక్తి, సేవాభావాన్ని చాటుకున్న సర్పంచ్ ముత్తినేని యాకలక్ష్మిని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు చింతకింది ప్రసాద్, సంపత్,సుధాగాని రమేష్,యాకయ్య,బండి కృష్ణ, గుర్రం నరేష్, ప్రవీణ్, ప్రశాంత్, నాగరాజు, విజయ్, శ్రీకాంత్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ అభివృద్ధి పనులపై బీజేపీ నిరసన దీక్ష

రాజన్న సిరిసిల్ల, నవంబర్ 24:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణ పనులు ఆగమ శాస్త్ర సంప్రదాయాలకు అనుగుణంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ వేములవాడ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఒక్కరోజు నిరసన దీక్ష నిర్వహించనున్నారు. ఆలయ పనులు ప్రారంభమై ఏడాది దాటినా ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతి, తొలగించిన నిర్మాణాలు, భవిష్యత్తు నిర్మాణాలపై స్పష్టత ఇవ్వాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు రాపెల్లి శ్రీధర్ కోరారు. ఆలయ ప్రాచీన చరిత్ర, శిల్పకళా వైభవం, పవిత్రత, ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ఎలాంటి విఘాతం కలగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 25న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు రాజన్న ఆలయం ఎదుట నిరసన దీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రాజన్న భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మీడియా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరై కవరేజీ అందించాలని విజ్ఞప్తి చేశారు.

బ్లాక్‌మెయిల్ వేధింపులు భరించలేక గిరిజన యువతి ఆత్మహత్య

యువతిని వేధించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

ఆదిలాబాద్, నవంబర్ 24: మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కొమ్ముగూడెంకు చెందిన ఓ వ్యక్తి బ్లాక్‌మెయిల్ వేధింపులు భరించలేక నిర్మల్ జిల్లా కడెం మండలం చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన పూర్క నాగమణి (21) అనే గిరిజన యువతి ఆత్మహత్య చేసుకుంది. సోమవారం రాత్రి మనస్తాపానికి గురై ఉరేసుకొని మృతి చెందినట్లు కడెం పోలీస్‌స్టేషన్ ఎస్సై పి. సాయికిరణ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్న బెల్లాల్ గ్రామానికి చెందిన నాగమణి తల్లిదండ్రులు పూర్క హనుమంతు, మాధవి కొన్ని సంవత్సరాల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి నుంచి నాగమణి టైలరింగ్ పనులు చేసుకుంటూ తన చిన్నబాపు లింబారాం వద్ద ఉంటోంది.

ఈ నెల 23న రాత్రి 11.30 గంటలకు నాగమణి ఫోన్‌లో మాట్లాడుతుండగా ఆమె చిన్నబాపు చూశారు. 24వ తేదీ తెల్లవారుజామున 5 గంటలకు నిద్రలేచి చూడగా ఇంటి పక్కనే ఉన్న రేకుల షెడ్‌లో దూలానికి చిన్న తాడుతో ఉరేసుకొని కనిపించింది. వెంటనే వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు లింబారాం తెలిపారు. గత కొన్ని నెలలుగా ఓ వ్యక్తి నాగమణిని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరించేవాడని, చనిపోవాలని కూడా బెదిరించడంతో భయపడిన నాగమణి తాను చనిపోతున్నట్లు అతని ఫోన్ నంబర్‌కు వాట్సాప్‌లో సందేశం పంపి ఆత్మహత్య చేసుకుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar,Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93.
E-mail :netinijam93@gmail.com.